## పట్టణ ప్రజలు టీఆర్ఎస్‌కే పట్టం కట్టాలి

### మలేషియా టీఆర్ఎస్ శాఖ పిలుపు

హైదరాబాద్,జనవరి20(ఆర్ఎన్ఎ): పట్టణ ప్రగతి పరుగులు పెట్టాలంటే మున్సిపల్ ఎన్నికల్లో అధికార టీఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టాల్సిందిగా టీఆర్ఎస్ మలేషియా శాఖ ఓటర్లను కోరింది. మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న చేస్తున్న టీఆర్ఎస్ అభ్యర్థులకు ఆ శాఖ తన సంపూర్ణ మద్దతును ప్రకటించింది. ఈ సందర్భంగా టీఆర్ఎస్ మలేషియాశాఖ అధ్యక్షుడు చిట్టిబాబు చిరుత మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ చేపట్టిన అనేక సంక్షేమ పథకాలు ఇప్పటికే మంచి ఫలితాలను ఇస్తున్నాయ న్నారు. ప్రతీ ఎన్నికల్లో టీఆర్ఎస్ విజయదుందుబి మోగించిందన్నారు. ఇప్పుడు పురపాలిక ఎన్నికల్లో సైతం అన్ని స్థానాల్లో విజయం సాధించడం ఖాయమ న్నారు. ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాలు నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు. బంగారు తెలంగాణ నిర్మాణం ఒక్క టీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మారుతి కుర్మ, కార్యదర్శి గుండా వెంకటేశ్వర్లు, కోర్ కమిటీ సభ్యులు మునిగల అరుణ్, బొయిని శ్రీనివాస్, బొడ్డు తిరుపతి,గద్దె జీవన్ కుమార్, రమేష్ గౌరు, సందీప్ కుమార్ లగిశెట్టి, సత్యనారాయ ణరావ్ నడిపెల్లి, రవితేజ, రఘునాథ్ నాగబండి, రవిందర్ రెడ్డి , హరీష్ గుడిపాటి, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# నేటి నిజం


తెలుగు దినపత్రిక

website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 21-1-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :26 సంచిక: 150 పేజీలు: 4 వెల: రూ.1/-


# మున్సిపల్ ఎన్నికల్లో టీఆర్ఎస్ అక్రమాలు




సిద్దిపేట జిల్లా పుల్లూరు బండ జాతరకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం తన నివాసంలో ఆవిష్కరించిన మంత్రి హరీష్ రావు

## టీఆర్ఎస్, బీజేపీ మధ్యనే ప్రధాన పోటీ

### కెసిఆర్, ఓవైసీలు ఏకమైనా బిజెపిని అడ్డుకోలేరు

### చౌటుప్పల్ ప్రచారంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

యాదాద్రి భువనగిరి, జనవరి20 (ఆర్ఎన్ఎ): మున్సిపల్ ఎన్నికల్లో టీఆర్ఎస్‌కు గెలుపుపై విశ్వాసం లేకనే బీజేపీ అభ్యర్థులను బెదిరిస్తున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్లమెంటు ఫలితాలే పునరావృతం అవుతాయన్నారు. టీఆర్ఎస్, బీజేపీ మధ్యనే పోటీ నెలకొందని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. 2026లో పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన ఉంటుందని స్పష్టం చేశారు.

డబ్బులతో టీఆర్ఎస్.. మోదీ పాలనతో బీజేపీ ఎన్నికల బరిలో దిగుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణకు కేంద్రం 3 లక్షల ఇళ్లు మంజూరు చేసినా.. ఒక్క ఇంటికి కూడా టీఆర్ఎస్ ప్రభుత్వం దరఖాస్తు చేయ లేదన్నారు. యూపీఏ, ఎన్డీయే ప్రభుత్వాల హయాంలో రాష్ట్రానికి ఇచ్చిన నిధులపై.. టీఆర్ఎస్ శ్వేతపత్రం విడుదల చేయాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. కేవలం ఎంఐఎం పార్టీపై మాత్రమే తమ పోరాటమని.. ముస్లింలకు బీజేపీ వ్యతిరేకం కాదనీ కేంద్ర సహాయ మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీలో బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్, ఓవైసీ బ్రదర్స్ కలిసి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. మెజార్టీ మున్సిపాలిటీ స్థానాల్లో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. 2023 ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందని... లక్ష మంది ఓవైసీలు, కేసీఆర్‌లు వచ్చినా బీజేపీ హవాను అడ్డుకోలేరని కిషన్ రెడ్డి తెలిపారు. టీఆర్ఎస్, మజ్లిస్ లాంటి పార్టీలు, స్వార్థ శక్తులు ఎన్ని అడ్డుపడినా తెలంగాణలో బీజేపీ శక్తిని ఆపలేరని అన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించిన సీఎం కేసీఆర్‌కు మునిసిపల్ ఎన్నికల్లో ఓట్లడిగే అర్హత లేదన్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా ఆమనగల్లులో, నాగర్‌కర్నూలులో నిర్వహించిన రోడ్‌షోల్లో కిషన్‌రెడ్డి మాట్లాడారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో ప్రజలకు ఒరిగిందేమీలేదని, బంగారు తెలంగాణ పేరుతో కేసీఆర్ తన కుటుంబాన్ని మాత్రమే బాగు చేసుకున్నారన్నారు. జన బలం లేని కేసీఆర్ డబ్బు, అధికార బలంతో ఎలాగైనా గెలవాలని కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. కేంద్రం తెలంగాణకు 2 లక్షల ఇళ్లు మంజూరు చేస్తే రాష్ట్ర ప్రభుత్వం నేటికీ వాటిని పూర్తి చేయలేదని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య ప్రభుత్వం కాకుండా తండ్రీ కొడుకుల ప్రభుత్వం కొనసాగుతుందని కిషన్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికలు సాధారణ ఎన్నికలు కావని రాష్ట్ర రాజకీయాలను మలుపు తిప్పేవన్నారు. టీఆర్ఎస్, ఎంఐఎం ఒకవైపు, బీజేపీ ఒకవైపని అన్నారు. ఇతర పార్టీల నుంచి పోటీ చేసే అభ్యర్థులను బెదిరిస్తూ టీఆర్ఎస్ కుట్ర చేస్తుందని, ఇంత దిగజారుడు రాజకీయం ఎన్నడూ చూడలేదని పేర్కొన్నారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా పరోక్షంగా ఎన్నికల్లో గెలిచేందుకు టీఆర్ఎస్ ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు. అధికార పార్టీ నాయకులకు ఓటర్లపై నమ్మకం లేదని కేవలం డబ్బు, ఎంఐఎం పార్టీ పైనే నమ్మకం ఉందన్నారు. 2014లో 2లక్షలు ఇళ్లు కట్టిస్తామని హామీ ఇచ్చారని, ఇప్పటి వరకు కేంద్రానికి ఒక్క లబ్దిదారుని పేరు కూడా పంపలేదన్నారు. రాష్ట్రంలో అభివృద్ధిపై చర్చించేందుకు కేటీఆర్ తనకు ఎర్ర తివాచి పరుస్తా అన్నాడని, పేదలకు ఇళ్లు కట్టిసే తానే కేటీఆర్‌కు ఎర్ర తివాచి పరుస్తానని అన్నారు.

బంగారు తెలంగాణ బదులు బంగారు కుటుంబం తయారైందన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేస్తే ధర్మానికి వేసినట్లేనని, టీఆర్ఎస్‌కు వేస్తే అవినీతికి వేసినట్లేనని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ వంటి మంచి పథకాన్ని కేంద్రం ప్రవేశపెడితే తెలంగాణాలో అడ్డుకుంటున్నారని చెప్పారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాకుండా అడ్డుకుంటామని ఓవైసీ అన్నాడని, లక్షమంది ఓవైసీలు వచ్చినా బీజేపీ గెలుపును అడ్డుకోలేరన్నారు. ఆయన వెంట పలువురు బిజెపినేతలు పాల్గొన్నారు.

## మూడు రాజధానులకు ఏపీ కేబినెట్ ఆమోదం

అమరావతి, జనవరి 20: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో సీఆర్‌డీఏ(క్యాపిటల్ రీజియన్ డెవెలప్‌మెంట్ అథారిటీ) రద్దుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. హైపవర్ కమిటీ నివేదికను ఏపీ మంత్రివర్గం ఆమోదించింది. కాగా, నాలుగు కీలక బిల్లులకు ఏపీ మంత్రివర్గం ఆమోదం తెలియజేసింది. పాలన వికేంద్రీకరణ, అన్ని ప్రాంతాలకు సమగ్ర అభివృద్ధి బిల్లుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అమరావతిలోనే అసెంబ్లీ కొనసాగనుంది. విశాఖపట్నం కేంద్రంగా ఏపీ సచివాలయం కార్యకలాపాలు జరగనున్నాయి. జ్యుడిషియల్ క్యాపిటల్‌గా కర్నూలు ఏర్పాటు కానుంది. రాష్ట్రాన్ని 4 పరిపాలన జోన్లుగా విభజించాలని, మంత్రులు రెండు చోట్ల అందుబాటులో ఉండాలని ప్రభుత్వం నిర్ణయించింది.

రాజధాని ప్రాంతంలో ప్లాట్లు అభివృద్ధి చేసి, రైతులకు ఇవ్వాలని ఏపీ మంత్రి వర్గం నిర్ణయించింది. ఇన్‌సైడర్ ట్రేడింగ్‌పై లోకాయుక్తతో విచారణ జరించాలని ఏపీ మంత్రివర్గం నిర్ణయించింది. పులివెందుల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటును మంత్రివర్గం ఆమోదించింది. రాజధాని రైతులకు ఇచ్చే పరిహారంపై సమావేశంలో చర్చ జరిగింది. రైతులకు ఇచ్చే కౌలును 10 ఏళ్ల నుంచి 15 ఏళ్లకు పెంచుతూ, రైతు కూలీలకు నెలవారీగా ఇచ్చే ఆర్థిక సాయాన్ని రూ. 2,500 నుంచి రూ. 5000లకు పెంచుతున్నట్లు మంత్రివర్గం నిర్ణయించింది. సీఆర్‌డీఏని.. అమరావతి మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీగా మారుస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది.రాష్ట్రంలోని 13 జిల్లాలను 25 జిల్లాలకు పెంచే విషయంపై కేబినెట్‌లో చర్చ జరిగింది. జిల్లాల విభజన అనంతరం సూపర్ కలెక్టరేట్ వ్యవస్థ ఏర్పాటు చేయనున్నట్లు మంత్రివర్గం తెలిపింది. అలాగే 11,158 రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందుకు గానూ రూ. 199 కోట్లు కేటాయింపుకు మంత్రివర్గం ఆమోదించింది.

## కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి శూన్యం: మంత్రి ఎర్రబెల్లి




వరంగల్ రూరల్, జనవరి 20: కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. వర్ధన్నపేట మున్సిపల్ ఎన్నికల రోడ్‌షోలో మంత్రి నేడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి శూన్యమన్నారు.

టీఆర్ఎస్ హాయాంలో వర్ధన్నపేట ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. వర్ధన్నపేట గ్రామపంచాయతీని మున్సిపాలిటీ చేసుకున్నామన్నారు. రూ. 2 వేల పింఛన్ ఇచ్చి వృద్ధులను టీఆర్ఎస్ ప్రభుత్వం ఆదుకుంటోందన్నారు. తాగునీటికి, సాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి చేసి చెరువుల్లో నీళ్లు నింపిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. పల్లె ప్రగతి కార్యక్రమంలో పల్లెల్లో పచ్చదనం వెల్లివిరిసిందన్నారు. అదే విధంగా త్వరలోనే పట్టణ ప్రగతి కార్యక్రమం చేపట్టబోతున్నట్లు తెలిపారు.

# టీఆర్ఎస్‌ను గెలిపిస్తే మహానగరంగా పాలమూరు

### మార్నింగ్ వాకర్స్‌ను కలసి ఓట్లు అభ్యర్థించిన మంత్రి

మహబూబ్‌నగర్,జనవరి20(ఆర్ఎన్ఎ): ప్రజలు సహకరించి టిఆర్ఎస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే మహబూబ్‌నగర్ పట్టణాన్ని మహానగరంగా తీర్చిదిద్దుతామని మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. అభివృద్ధికి ప్రజలు పట్టం కట్టాలన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఈ ఉదయం మహబూబ్‌నగర్ పట్టణ కేంద్రంలో పర్యటించారు. ప్రచారంలో భాగంగా తెల్లవారుజామున స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో మార్నింగ్ వాకర్స్‌ను కలిసి. టీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులకు ఓటువేసి గెలిపించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో 49వ వార్డు అభ్యర్థి పుష్ప పతి, 39వ వార్డు అభ్యర్థి బి.రమాదేవి, కృష్ణ మోహన్, రాథ అమర్, అమర్, వెంకటేశ్వర్‌రెడ్డి, బెక్కం జనార్దన్, పాండురంగం, రాజేశ్వర్, నిరంజన్‌రెడ్డి, మల్లు నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. టీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని మరింత ముందుకు తీసుకువెళ్లేలా పట్టణవాసులు మున్సిపల్ ఎన్నికల్లో తీర్పు ఇవ్వాలని మంత్రి ఓటర్లను కోరారు. 2014 ముందకు కరెంట్ ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి.. కానీ నేడు సీఎం కేసీఆర్ నాయకత్వంలో 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామన్నారు. అన్ని ఆలోచించి కారు గుర్తుకు ఓటేసి టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించా ల్సిందిగా మంత్రి కోరారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధే ఎజెండాగా టీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. పేదలను ఉన్నతస్థాయికి తీసుకుపోవడమే లక్ష్యంగా ప్రతి గడపకూ సంక్షేమ పథకాలను అందిస్తు న్నామన్నారు. గత పాలకుల హయాంలో మహబూబ్‌నగర్ పట్టణంలో నెలకొన్న నీటి ఇబ్బందులను ఒక్కసారి గుర్తు చేసుకోవాలని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని కాలనీల్లో తాగునీటి వసతితోపాటు, అభివృద్ధి పనులు కండ్ల ముందు కనిపిస్తున్నాయన్నారు. నిర్లక్ష్యం అనే మాటకు తావు లేకుండా ప్రతిక్షణం అభివృద్ధి కోసం కంకణబద్దులమై పని చేస్తున్నామని తెలిపారు. పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేవిధంగా పార్కుల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. మన వార్డును మరింత అభివృద్ధి చేసుకుందామనే పట్టుదల ఉన్నవారు మాత్రమే టీఆర్ఎస్ తరుఫున మున్సిపల్ ఎన్నికల బరిలో ఉన్నారని తెలి పారు. ఎన్నికల సందర్భంగా ఇతర పార్టీలు చె ప్పే మాయమాటలను నమ్మవద్దని కోరారు. అన్ని వార్డుల ప్రజలు ఐక్యంగా ఉండి టీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.




మహబూబ్‌నగర్ పట్టణంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా మార్నింగ్ వాకర్స్‌ను కలిసిన మంత్రి శ్రీనివాసగౌడ్

# టిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించండి

### దత్తత తీసకుని అభివృద్ధి చేస్తాం

### మహబూబాబాద్‌లో మంత్రి సత్యవతి ప్రచారం

మహబూబాబాద్,జనవరి20 (ఆర్ఎన్ఎ): జిల్లాలోని సాంక్రియ తండా, బాబు నాయక్ తండాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తానని మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. మహబూబాబాద్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 8, 20వ వార్డుల అభ్యర్థులను గెలిపించాల్సిందిగా కోరుతూ మంత్రి సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ నుంచి వార్డు సభ్యుల వరకు అంతా టీఆర్ఎస్ పార్టీ నేతలేనన్నారు. సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి నిరుపేదలకు లబ్ధిచేకూరుస్తున్నారన్నారు. పింఛన్లు, కల్యాణలక్ష్మీ, షాదీముబారక్, కేసీఆర్ కిట్, విద్యార్థులకు సన్నబియ్యం, డబుల్ బెడ్రూం ఇండ్లు, తండాలకు సీసీ రోడ్లు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, రైతులకు 24 గంటల విద్యుత్ ఇలా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఈ ప్రాంతాన్ని దత్తత తీసుకుని అన్ని అభివృద్ధి చేస్తానని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం మనది. వచ్చే నాలుగేళ్లు ఉండేది మనం. ఇతరులకు ఓటేస్తే అది వృథా. కారు గుర్తుకు ఓటేసి టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాల్సిందిగా మంత్రి కోరారు. టీఆర్ఎస్ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపిస్తే అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాలకు నిధులను తీసుకొచ్చి రోడ్లు, డ్రైనేజీలను శరవేగంగా అభివృద్ధి చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఓటు వేస్తే ఎలాంటి ప్రయోజనం ఉండదని, టీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి మరింత అభివృద్ధి చేసేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. టీఆర్ఎస్ పాలనలో అన్ని రంగాల్లో అభివృద్ధి జరుగుతుందన్నారు.

వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతూ పేద ప్రజల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా పరిపాలన కొనసాగిస్తున్నారని రైతులకు రైతుబంధు, రైతు భీమా, వృద్ధులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు ఆసరా పింఛన్లను అందిస్తున్నారన్నారు. ఇలాంటి సంక్షేమ పథకాలు మరి ఏ రాష్ట్రంలో కూడా అమలు జరగడం లేదన్నారు. ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు ఆశపడకుండా అభివృద్ధిని చూసి టీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలని సూచించారు. ఈ ప్రచారంలో ఎన్నికల ఇంచార్జి ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్, ఎమ్మెల్యే శంకర్ నాయక్ భార్య సీతామహాలక్ష్మి, స్థానిక నేతలు పాల్గొన్నారు.




మహబూబాబాద్ మున్సిపల్ ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతున్న మంత్రి సత్యవతి రాథోడ్

## చరిత్రలో నేటినిజం



కం॥ మన మానసముల దోచుచు
మనగలిగిన సత్కవితలు మనకందింపన్
మన కాలపు సత్కవిగా
తన రెడి 'ఎండ్లూరి' మేల 'సుధాకరు' దలతున్!!



(జనవరి 21 ఎండ్లూరి సుధాకర్ జననం) -రాధశ్రీ

సెల్: 9494481210




బడ్జెట్‌కు ముందు నార్త్‌బ్లాక్‌లో హల్వా తయారీని ప్రారంభించిన కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్

# బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా జేపీ నడ్డా ఏకగ్రీవ ఎన్నిక

న్యూఢిల్లీ:, జనవరి 20 బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఆ పార్టీ సీనియర్ నేత, జేపీ నడ్డా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, కేంద్ర మంత్రులు, పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలకు చెందిన మంత్రులు పార్టీ జాతీయాధ్యక్షుడిగా నడ్డాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నడ్డాకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా అభినందనలు తెలిపారు. ప్రస్తుతం నడ్డా బీజేపీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా విధుల్ని నిర్వహిస్తున్నారు.విద్యార్థి దశ నుంచే బీజేపీ రాజకీయ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్న నడ్డాకు మచ్చలేని నేతగా ఆ పార్టీలో మంచి పేరుంది. ఈ పదవికి ఆయనే సరైన వ్యక్తి అని ప్రధాని మోదీ, హోంమంత్రి, ప్రస్తుత పార్టీ అధ్యక్షుడు అమిత్ షా భావించడంతో ఆయన ఎన్నిక దాదాపు ఖరారైనట్టైంది. బీజేపీ జాతీయాధ్యక్షుడిగా గత ఐదున్నరేండ్లుగా అమిత్ షా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించి.. బీజేపీ నేతృత్వంలో ఏర్పడిన మోదీ 2.0 ప్రభుత్వంలో ఆయనకు హోంశాఖ దక్కింది. 'ఒక వ్యక్తి, ఒక పదవి' సంప్రదాయాన్ని బీజేపీ ప్రారంభించడంతో అమిత్ షా ప్రస్తుతం నిర్వహిస్తున్న జాతీయాధ్యక్షుడి పదవికి కొత్త వ్యక్తిని తీసుకోవడం అనివార్యమైంది.



## ఆగని బొగ్గు పొగలు...

నేటినిజం
మంగళవారం 21-1-2020

ప్రశాంత మహాసాగరం– పసిఫిక్ ఓషన్–లో ‘కిరివటి’అన్న చిన్న దేశం నెలకొని ఉంది. చిన్న చిన్న ద్వీపాల సమూహం ఈ దేశం. ఎనిమిది వందల పదకొండు చదరపు కిలోమీటర్ల ఈ దేశం జనాభా లక్షా పదహైదు లక్షలు. ముప్ఫయి రెండు ద్వీపాల సముదాయమైన ఈ దేశానికి పదకొండు వందల నలబయి మూడు కిలోమీటర్ల సముద్ర తీరం ఉందట. ఈ ద్వీపాలు ఎంత చిన్నవో దీనివల్ల ఊహించుకోవచ్చు. ఈ ద్వీపవాసులకు తగినంత ఆహారం ఈ ద్వీపాలలో లభించడం లేదట. అందువల్ల ‘కిరివటి’ప్రభుత్వం దేశంలో ఆరువేల ఎకరాల భూమిని కొని అక్కడ వ్యవసాయం చేయిస్తోందట. సగటున ఈ ‘కిరివటి’ దేశపు ఉపరితలం సముద్రపు నీటిమట్టానికి కేవలం ఆరు మీటర్ల ఎత్తున నెలకొని ఉందట! అందువల్ల సముద్రపు నీటిమట్టం పెరిగినట్టయితే తమ దేశం సముద్ర జలాలతో నిండిపోతుందని ఆ దేశం ప్రభుత్వం 2015 ఆగస్టులో “పారిస్ సదస్సు”లో పాల్గొంటూ ఉండిన దేశాల ప్రభుత్వాలకు తెలియచేసింది. అందువల్ల సముద్రపు నీటిమట్టాన్ని పెంచే ‘ఉష్ణోగ్రత’ పెరగకుండా నిరోధించాలని ‘కిరివటి’ ప్రభుత్వం ప్రపంచ దేశాలకు విజ్ఞప్తిచేసింది. బొగ్గు కాలుష్యంవల్లనే ప్రధానంగా ఉష్ణోగ్రత పెరుగుతోందని, అందువల్ల కొత్తగా బొగ్గు గనుల– కోల్ బ్లాక్స్–ను ఏర్పాటుచేయరాదని ‘కిరివటి’ ప్రభుత్వం కోరింది.

బొగ్గు తవ్వకాలను క్రమంగా తగ్గించివేయాలన్నది ‘కిరివటి’ ఆకాంక్ష. ఇంధన తైలం, ఇంధన వాయువులు కాలినప్పటికంటె బొగ్గు కాలడంవల్ల మరింత ఎక్కువగా కాలుష్య తరంగాలు ఏర్పడుతున్నాయట. పశ్చిమ బెంగాల్‌లోని ‘ఘోరమర’అన్న దీవి క్రమంగా జలగ్రస్తం అవుతోందట. ఈ దీవి బంగాళాఖాతంలో గంగానది కలిసేచోట నెలకొని ఉంది.

ఈ ద్వీప నివాసులు ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నారట. కేరళలోని కొల్లమ్ జిల్లాలో కూడ ఈ దీవి క్రమంగా జలమయం అవుతోందట!!

బ్రిటన్ దురాక్రమణ కొనసాగిన సమయంలో మన దేశంలో ప్రభుత్వేతర సంస్థలు బొగ్గు తవ్వకాలను జరిపేవి. 1973వరకు ఈ పద్ధతి నడిచింది. 1973లో కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనులను జాతీయకరణ చేసింది. ఫలితంగా ప్రభుత్వరంగ వాణిజ్య సంస్థ ‘కోల్ ఇండియా’దేశంలోని బొగ్గు గనుల నిర్వహణను చేపట్టింది. అయితే కేవలం ‘విద్యుత్ ఉత్పాదక’ పరిశ్రమలకు, సిమెంటు, ఉక్కు పరిశ్రమలకు విక్రయించడానికి బొగ్గును తవ్వే పనిని ప్రభుత్వేతర సంస్థలకు కూడ అప్పగించారు. అయితే ప్రధానంగా తవ్వకాలను కోల్ ఇండియా నిర్వహించడం చరిత్ర.

ఇలా ప్రభుత్వరంగ సంస్థ, పరిమిత ప్రయోజనాలకోసం ప్రభుత్వేతర సంస్థలు బొగ్గును తవ్వినప్పటికీ అవసరాలకు తగినంత బొగ్గు ఉత్పత్తికాలేదు. ప్రధానంగా థర్మల్ విద్యుత్ ఉత్పత్తికేంద్రాలకు బొగ్గు అవసరం ఎక్కువగా ఉంది! అందువల్ల అణు విద్యుత్తు, సౌర విద్యుత్తు, జల విద్యుత్తు, వాయు విద్యుత్తు ఉత్పత్తులు బాగా పెరిగేవరకు విద్యుత్ ఉత్పత్తికోసం ‘బొగ్గు’ను కాల్చక తప్పనిస్థితి ఏర్పడింది. ఒకప్పుడు దేశంలో బొగ్గును కాల్చి నీటిని మరిగించి ‘ఆవిరి’ ఇంధనం ద్వారా బస్సులను నడిపారట. తరువాత బస్సులకు ‘డీజెల్’ నూనె ఇంధనమైంది.

దశాబ్దులపాటు రైళ్లను ప్రధానంగా ఆవిరి యంత్రాల– స్టీమ్ ఇంజన్‌లు– ద్వారానే నడపడం చరిత్ర. ఈ ‘బొగ్గు’బస్సులు ఎప్పుడో అంతరించాయి, ‘బొగ్గు’రైళ్లుకూడ కనుమరుగయ్యాయి. రైళ్లలో బొగ్గును వాడిన సమయాలలో బొగ్గు దొంగతనాలు విరివిగా జరిగేవి. ఇదంతా గతం.

ఇళ్లలో వంటలకు, నీరు కాచడానికి బొగ్గు వాడడం కూడ ఇప్పుడు దాదాపు ఆగిపోయింది. పల్లెపల్లెకూ వంట ‘ఇంధనం వాయువు’ సరఫరా అవుతుండడం ప్రభుత్వం సాధించిన సంక్షేమం! కానీ రైళ్లలో బొగ్గు ఉపయోగం, బొగ్గు దొంగతనాలు ఆగిపోయిన తరువాతనే 2012లో అతి పెద్ద బొగ్గు దొంగతనం బయట పడింది. చరిత్రలోనే అతి పెద్ద అవినీతి అది. బొగ్గు బొరియలను కేటాయించిన ప్రభుత్వ నిర్వాహకులు భారీగా అవినీతికి పాల్పడినారన్నది ఆరోపణ. దాదాపు లక్ష ఎనబయి ఆరువేల కోట్ల రూపాయల ‘దొంగతనం’ అది. రెండువందల నాలుగు కేటాయింపులను సర్వోన్నత న్యాయస్థానం ఆ తరువాత రద్దుచేయడం చరిత్ర...

## ఫిబ్రవరి 1నుండి 6వరకు చెర్వుగట్టు జాతర

### జాతరకు భారీగా ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
### లక్షల మంది భక్తులు వస్తారని అంచనా
### ప్రత్యేక సర్వీసులు నడపనున్న ఆర్టీసీ

నల్లగొండ,జనవరి20(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలోనే ప్రసిద్ధ శైవ క్షేత్రమైన చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఫిబ్రవరి 1 నుండి 6వ తేదీ వరకు నిర్వహించనున్న చెర్వుగట్టు శ్రీపార్వతీ జడల రామలింగేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగ నున్నాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా సకల సౌకర్యాలు కల్పిస్తున్నామని ఇన్‌చార్జి కలెక్టర్ వి.చంద్రశేఖర్ అన్నారు. వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాటుపై జడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యలతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. భక్తుల సౌకర్యార్థం హైదరాబాద్ జోన్ పరిధిలోని అన్ని డిపోల నుంచి ఆర్టీసీ బస్సులు చెర్వుగట్టు వరకు నడిపేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా మౌలిక వసతులు ఇప్పటికే ఏర్పాటు చేశామని చెప్పారు. మరోవైపు చెర్వుగట్టు బ్రహ్మోత్సవాలకు తరలి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగం పూర్తిగా సన్నద్ధమయ్యింది. ఇందుకు అనుగుణంగా జిల్లా పోలీస్ యంత్రాంగం భద్రాచర్యలు చేపట్టింది. 500మంది సిబ్బంది, సీసీ, డ్రోన్ కెమెరాలతో పోలీసు అధికారులు భద్రతను పర్యవేక్షించనున్నారు. సుమారు 5 లక్షల మంది భక్తులు వస్తారని దేవాలయ పాలక మండలి అంచనా వేస్తుంది. ముఖ్యంగా రామలింగేశ్వరని కల్యాణం, అగ్నిగుండాలు, హంస వా హన సేవను తిలకించేందుకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదని కలెక్టర్ అధికారుల తో ప్రత్యేక ఏర్పాట్లను చేయిస్తున్నారు. మరుగుదొడ్ల నిర్మాణ పనులను,మంచి నీటి ట్యాంకులను నిర్మిస్తున్నారు. చెర్వుగట్టు జాతర కోసం పోలీసు శాఖ ఎలాంటి అవాంఛనీయ సం ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. గుట్ట పైకి వృద్ధులు, చిన్న పిల్లలను చేరవేసేందుకు ఆటోలను మాత్రమే అనుమతిస్తారు. జాతరకు వచ్చే భక్తులకు రవాణా సౌకర్యం కోసం నార్కట్‌పల్లి డిపో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. నార్కట్‌పల్లి, నల్లగొండ, యాదగిరిగుట్ట, సూర్యాపేట, దేవరకొండ, కోదాడ డిపోల నుంచి ఈ జాతరకు ప్రత్యేక బస్సులను నడుపనున్నారు. నార్కట్‌పల్లి డిపో నుంచి నల్లగొండకు వెళ్లే ప్రతీ సర్వీసు చెర్వుగట్టు మీదుగా నడుపుతామని డిపో మేనేజర్ తెలిపారు. ఆయాశాఖల అధికారులు తమకు కేటాయించిన బాధ్యతలు పారదర్శకంగా నిర్వహిస్తూ దైవ సన్నిధిలో సేవాభావంతో భక్తులకు సేవలు అందించాలని కోరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దూరప్రాంతాల నుంచి భక్తులు వాహనాలపై వస్తారు కనుక ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్‌కు కట్టుదిట్టమైన చర్యలు తీసుకునేలా ఏర్పాట్లను పర్యవేక్షించాలని డీఎస్పీ వెంకటేశ్వర్‌రెడ్డికి సూచించారు. ముఖ్యంగా బ్రహ్మోత్సవాల్లో ఎ÷–లాస్టిక్‌ను నిషేధించి పర్యావరణ పరిరక్షణకై భక్తులకు ప్లాస్టిక్ వాడవద్దని తెలిసేలా చేయాలన్నారు. దేవాలయ పరిసర ప్రాంతాలలో ప్లెక్సీలు ఏర్పాటు చేయవద్దని హెచ్చరించారు. ముఖ్యంగా దేవాలయ ప్రాశస్త్యం గురించి ఇతర ప్రాంతాలవారికి తెలిసేలా వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేయాలని ఈఓ సులోచనకు సూచించారు. బ్రహ్మోత్సవాలు విజయవంతం కావాలంటే ప్రతీఒక్కరికి ప్రణాళికబద్దంగా కమ్యూనికేషన్ ఎప్పటికప్పుడు ఉండాలని అందుకు అధికారులు, సిబ్బంది ఫోన్‌నెంబర్లను ముద్రించి పంపిణీ చేయాలన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు లక్షల్లో భక్తులు వస్తారు కనుక భక్తులకు ఇబ్బందులు కలిగించవద్దని అన్నారు. దేవాలయ పరిసర ప్రాంతాల్లో కృత్రిమ రంగులతో తయారుచేసిన ఆహారపదార్థాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. గ్రామ పంచాయతీ సిబ్బంది గుట్టకింద దుకాణాలను వెనుకకు ఉండేలా చర్యలు తీసుకోవా లన్నారు. ఎమ్మెల్యే చిరుమర్తి మాట్లాడుతూ దేవాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ బ్రహ్మోత్సావాలను విజయవంతం చేయాలన్నారు. దూరప్రాంతాల నుంచి భక్తులకు అధిక సంఖ్యలో వస్తారు కనుక ఇప్పటినుండే ప్రచారం ముమ్మరం చేయాలని ఈఓ, సూపరిండెంట్ సమన్వయంతో ఉంటూ సిబ్బందిని అప్రమత్తం చేస్తూ పనులు నిర్వహించాలన్నారు. అనంతరం బ్రహ్మోత్సవాల గోడ పత్రిక, కరపత్రాలను ఆవిష్కరించారు.

## గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు

### పంచాయితీలకు అందనున్న అవార్డులు

మెదక్,జనవరి20(నేటినిజం ప్రతినిధి): మెదక్ జిల్లా కేంద్రంలో గణతంత్ర వేడుకలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మైదానాన్ని అన్ని హంగులతో శోభాయమానంగా తీర్చిదిద్దాలని అధికారులు సూచించారు. బందోబస్తు, పార్కింగ్, జాతీయ పతాకం, పరేడ్ కార్యక్రమాలు పోలీసు శాఖ పర్యవేక్షించాలని, తాగునీరు, పారిశుద్ధ్య పనులు పురపాలిక శాఖ చేపట్టాలని ఆదేశించారు. గణతంత్ర వేడుకల సందర్భంగా అంతరాయం లేకుండా విద్యుత్తు సరఫరా జరిగేలా చూడాలని ఆ శాఖ అధికారులకు సూచించారు. అత్యవసర సేవల కోసం వైద్యశిబిరం ఏర్పాటు చేయడంతో పాటు అంబులెన్స్ అందుబాటులో ఉంచాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఆదర్శంగా నిలిచిన గ్రామాలకు, ఉత్తమ సేవలందించిన అధికారులకు గణతంత్ర వేడుకల సందర్భంగా ప్రశంసా పత్రాలు అందచేయాలని కలెక్టర్ నిర్ణయించారు. ఈ మేరకు వివిధ కార్యక్రమాల అమల్లో ఆదర్శంగా నిలిచిన గ్రామాలను గుర్తించాలని అధికారులకు సూచించారు. ఇప్పటి వరకు బహిరంగ మల విసర్జన రహిత, నగదు రహిత లావాదేవీలు నిర్వహించే గ్రామాలు గుర్తించి వారికి బహుమతులు అందించే ప్రతిపాదనలు ఉన్నాయి. ఆయా కార్యక్రమాల్లో ఆదర్శంగా నిలిచిన గ్రామాలకు, ఉత్తమ సేవలందించిన అధికారులకు గణతంత్ర వేడుకల సందర్భంగా ప్రశంసా పత్రాలు అందజేయడం ద్వారా ప్రోత్సహించాలని చూస్తున్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి జిల్లా ఔన్నత్యాన్ని చాటేలా గణతంత్ర వేడుకలు నిర్వహించేందుకు కృషి చేయాలని సూచించారు. దేశభక్తి, జాతీయభావాన్ని పెంపొందింపజేసేలా సాంస్కృతిక కార్యక్రమాలు ఉండాలని, ఈ విషయంలో పాఠశాల విద్యార్థులకు తగిన శిక్షణ ఇవ్వాలన్నారు. హరితహారం, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, ఉద్యాన, వ్యవసాయ తదితర ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలపై శకటాలు రూపొందించాలని స్పష్టం చేశారు.

## మేడారం జాతరతో పెరిగిన బెల్లం అమ్మకాలు

వరంగల్,జనవరి20(ఆర్ఎన్ఎ): కోరిన కోర్కెలు తీర్చే సమ్మక్క–సారక్కలకు నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించేందుకు భక్తులు ఇప్పటి నుంచే సిద్ధమవుతున్నారు. గత నెలరోజుల నుంచే మేడారం జాతరకు తరలివెళుతున్న భక్తులు తోవలో ఉన్న గ్రామాల్లో భారీగా బెల్లం కొనుగోళ్లు చేస్తున్నారు. వరంగల్‌తో పాటు ప్రధాన మండల కేంద్రాలు ఇతర ప్రాంతాల్లో బెల్లం అమ్మకాలు పెరిగాయి. మేడారంలో జరిగే సమ్మక్క–సారక్కల గద్దెల వద్ద బంగారాన్ని (బెల్లం) ఉంచి మొక్కులు తీర్చుకుంటారు. ఈనెలాఖరులో జరిగే ఈ జాతరకు భక్తులు బంగారం సమర్పించుకునేందుకు పట్టణంలోని మార్కెట్లను ఆశ్రయించారు. దీంతో బెల్లం విక్రయాలు జోరందుకున్నాయి. చుట్టుపక్కల ప్రాంతాలలో ఉండే ప్రజలు వారి చిన్నారులకు, కుటుంబ సభ్యులకు నిలువెత్తు బెల్లాన్ని తీసుకొని జాతరకు వెళ్లేందుకు సిదమవుతున్నారు. షాపుల్లో బెల్లం విక్రయాలు జరుగుతుండటంతో భక్తులు కొనుగోలు చేసేందుకు క్యూ కడుతున్నారు. దీంతో గత కొన్నిరోజులుగా అమ్మకాలు పెరిగాయి. దీనికితోడు బెల్లం విక్రయాలపై ఆంక్షలు లేవని అధికారులు ప్రకటించారు.

## పట్టణ పోరులో అన్ని పార్టీల దూకుడు

హైదరాబాద్, జనవరి 20:పట్టణపోరులో గతంలో ఎన్నడూ లేని విధంగా అన్నిపార్టీలు దూకుడు పెంచాయి. అధికార బిజెపికి దీటుగా కాంగ్రెస్, బిజెపిలు రంగంలోకి దిగాయి. ప్రత్యేక మ్యానిఫెస్టోలను విడుదల చేశారు. పట్టణాలను తామే అభివృద్ధి చేస్తామంటూ హామీలు గుప్పించారు. పండగ సమయంలో వచ్చిన ఎన్నికలైనా ప్రచారంలో అభ్యర్థులు వెనక్కి తగ్గకుండా ముందుకు సాగారు. కరీంనగర్ మినహా మిగా మున్సిపాలిటీల్లో సోమవారం తో ప్రచార పర్వం ముగిసింది. ఇకపోతే అధికార పార్టీ ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో టీఆర్ఎస్ దూకుడు పెంచింది. పట్టణాల అభివృద్ధిపై పరస్పర విమర్శలకు దిగారు. ఎవరికి వారు అభివృద్ధి నినాదాలను,ప్రత్యేక మానిఫెస్టోలను ప్రజల ముందుంచారు. ప్రచారానికి గడువు ముగియడంతో గులాబీదండు గడప గడపకూ వెళ్తోంది.. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ సాధిస్తున్న ప్రగతే గీటురాయిగా మున్సిపాలిటీ ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థులు ప్రచారంలో ముందుకెళ్తున్నారు.. అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరించి టీఆర్ఎస్ పాలనలోనే పట్టణాలు ప్రగతి పథంలో నడుస్తాయని ప్రజలకు తెలియజేస్తున్నారు.. మంత్రులు, ఎమ్మెల్యేలు విస్తృతంగా ప్రచారం చేస్తుండగా, ఛోటామోటా నాయకులు కూడా ప్రచారంలో దిగారు.ఇంటింటికీ వెళ్లి కారు గుర్తుకే ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. టీఆర్ఎస్ పార్టీకి ప్రజల్లో ఉన్న ఆదరణతో ప్రత్యర్థులు కకావికలం అవుతున్నారని ప్రచారంలో చెబుతున్నారు. కారు స్పీడును అందుకోలేని ప్రతిపక్షాల్లో ప్రచారం ఊసే కనిపించడం లేదని మంత్రులు అంటున్నారు. ఓటర్లు మాత్రం సంపూర్ణ అభివృద్ధిని కాంక్షిస్తూ ఇంటి పార్టీ అభ్యర్థులనే గెలిపించుకుంటామని తమ మనసులోని మాటను తెలియ బరుస్తున్నారు. బిజెపి నుంచి మంత్రి కిషన్ రెడ్డి, ఎంపిలు, అధ్యక్షుడు లక్ష్మణ్ సహా అంతా ప్రచారంలో ఉన్నారు. ఈ నెల 22న ఎన్నికలు జరగనున్న మున్సిపాలిటీల్లో టీఆర్ఎస్ పార్టీ ప్రచారంలో దూసుకు పోతోంది. ఆ యా పార్టీలకు చెందిన ముఖ్యనాయకులు వారంతా ప్రచారంలో దిగడం విశేషం. పట్టణ ఓటర్లు టీఆర్ఎస్‌కు బ్రహ్మరథం పడతారన్న ధీమాలు అధికార పార్టీ నేతలు ఉన్నారు. కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీల నాయకులు ప్రచారం చేయడానికి బలంగా ముందుకు సాగారు. ముఖ్యమంత్రి, పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు మున్సిపాలిటీల పరిధిలోని ఎమ్మెల్యేలకే ప్రచార బాధ్యతలను అప్పగించారు. ఈ ఎన్నికలకు రాష్ట్ర నాయకులు ఎవరూ ప్రచారం చేసే అవకాశం లేదు. దీంతో జిల్లాకు చెందిన మంత్రి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జడ్పీ చైర్మన్, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యేలు ప్రచారంలో నిమగ్నం అయ్యారు. వీరికి సహకారంగా స్థానిక నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులు, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, మాజీ కౌన్సిలర్లు ప్రచార బాధ్యతలు తీసుకున్నారు. వార్డుల వారీగా ఏర్పాటు చేసిన కమిటీల్లో వీరు ప్రధాన పాత్ర పోషించనున్నారు. ఇప్పటికే ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. సీఎం కేసీఆర్ అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికి తీసుకెళ్లి ప్రచారంలో టీఆర్ఎస్ కార్యకర్తలు ముందంజలో ఉన్నారు. ఇకపోతే సోమవారం సాయంత్రం 5 గంటలకు పురపాలక ఎన్నికల ప్రచారం ముగియనుందని రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది. గడువు ముగిసిన అనంతరం ఎలాంటి ప్రచారం చేయవద్దని ఎస్ఈసీ సూచించింది. సభలు, సమావేశాలకు అనుమతి లేదని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ప్రచారానికి సెల్‌ఫోన్, ఇంటర్నెట్ సైతం వాడకూడదని హెచ్చరికలు జారీ చేసింది. నిబంధనలు ఉల్లంఘించిన వారికి రెండేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా విధిస్తామని ఎస్ఈసీ పేర్కొన్నది. ప్రచారం ముగిసిన వెంటనే మద్యం దుకాణాలు, బార్లు మూసివేయాలని యాజమాన్యాలకు తెలియజేసింది. పోలింగ్ ముగిసే వరకు ఈ ఆంక్షలు కొనసాగుతాయని ఎస్ఈసీ తెలిపింది. ఇకపోతే ఎన్నికలు జరగనున్న ప్రాంతాల్లో స్థానిక సెలవు ప్రకటించినట్లు ఎన్నికల సంఘం తెలిపింది. ఉద్యోగులు కూడా ఓటు వేసేందుకు ముందుకు రావాలని, వారికి కంపెనీలు 3 గంటల పాటు సమయమివ్వాలని ఆయా కంపెనీలను ఆదేశించింది. ఓటు గోప్యతకు భంగం కలిగిస్తే 3 నెలల జైలు శిక్ష, జరిమానా విధిస్తామని ఎన్నికల సంఘం హెచ్చరికలు జారీ చేసింది. ఈ నెల 22న 9 నగరపాలక సంస్థలు, 120 మున్సిపాలిటీల్లో పోలింగ్ జరగనుంది. 9 కార్పోరేషన్లలోని 325 వార్డుల్లో 1,438 పోలింగ్ కేంద్రాలు, 120 మున్సిపాలిటీల్లోని 2, 727 వార్డుల్లో 6, 325 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎస్ఈసీ పేర్కొన్నది. కాగా, కరీంనగర్ మున్సిపాలిటీలో మాత్రం ఈ నెల 22న ప్రచారం ముగియనుంది. ఓటరు జాబితాలో తేడాలున్నాయని విపక్షాలు కోర్టులో కేసు వేయడంతో ఈ మున్సిపాలిటీకి కాస్త విరామం లభించింది. సోషల్ మీడియాలో ప్రచారం చేసినా కఠిన చర్యలు ఉంటాయని చెప్పింది. క్యాండిడేట్లు, రాజకీయ పార్టీలు, ప్రచార నిర్వాహకులు, మీడియా ఇన్ చార్జ్ లు దీన్ని గమనించి, కచ్చితంగా పాటించాలని ఆదేశించింది. మొత్తంగా గతంలో ఎన్నడూ లేనతగా పట్టణ ప్రాంతాల్లో ప్రచారం సాగింది. కొత్తగా ఏర్పడ్డ మున్సిపాలిటీల్లో కూడా ప్రచారం జోరందుకుంది. ఈ ఎన్ఇనకలను అన్ని పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో ప్రచారంలో వేడి అందుకుంది. ప్రజలు ఎవరికి పట్టం కడతారో చూడాలి.

## కాళేశ్వరంతో తీరనున్న కష్టాలు

### ముందుచూపుతో కెసిఆర్ పథకాలు
### మున్సిపల్ ఎన్నికల్లో క్లీన్‌స్వీప్ ఖాయం :మంత్రి

ఆదిలాబాద్,జనవరి20(ఆర్ఎన్ఎ): సాగునీటి ప్రాజెక్టులపై కేసీఆర్‌కు ఉన్న అవగాహనతో పాటు ఆయన రైతాంగం కోసం చేపడుతున్న కార్యక్రమాలు భవిష్యత్ దార్శనికతకు నిదర్శనమని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. కాళేశ్వరం ఎత్తిపోతలు గోదావరికి మహర్దశ ఇవ్వనున్నాయని అన్నారు. ఈ పనులను కేంద్ర జలసంఘం అభినందించిందని, తాజాగా గవర్నర్ వీటిని పరిశీలించారని అన్నారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవ చూపి భారీగా నిధులు ఖర్చుపెట్టి రైతాంగానికి సాగునీరు అందించిన తీరు గతంలో ఎప్పుడూ జరగలేదన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు అనేక విధాలుగా ఇప్పుడు ప్రయోజనాలు వస్తున్నాయని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేసిన అభివృద్ధి చూసి, ఆలోచించి ఓటు వేయాలని ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓట్లు వేసినా అవి నిష్ప్రయోజనమే అని పేర్కొన్నారు. నిర్మల్ పట్టణంలోని పలు వార్డులో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. నిర్మల్ జిల్లా ఏర్పడినప్పటి నుంచి పట్టణం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. పట్టణాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించడంతోనే సీసీ రోడ్లు, డ్రైనేజీలు, సెంట్రల్ లైటింగ్, ఫోర్‌లైన్ల నిర్మాణం, ఫుట్‌పాత్‌ల నిర్మాణంతో పాటు ఆహ్లాదాన్ని అందించేందుకు గండిరామన్న ఆలయం వద్ద హరితవనం ఏర్పాటు చేసినట్లు వివరించారు. మున్సిపల్ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ విజయం ఖాయమైందని, ఇక మెజార్టీ మిగిలిందన్నారు.

పట్టణంలో టీఆర్ఎస్ పార్టీ క్లీన్‌స్వీప్ చేయబోతుందన్నారు. పట్టణంలోని అన్ని వార్డులను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఇకపోతే ఎస్సీరెస్పీ పురుజ్జీవ పథకం తెలంగాణ చరిత్రలో మైలురాయి వంటిదని మంత్రి అన్నారు. ఎస్సీరెస్పీ పథకంతో తెలంగాణ ఉత్తర ప్రాంతానికి ఎంతో మేలు జరగగలదని అన్నారు. సీమాంధ్ర పాలకుల నిర్లక్ష్యంతో అనేక ప్రాజెక్టులకు వేసిన శంకుస్థాపన శిలాఫలకాలు సమాధి రాళ్ళుగా మారితే... వాటన్నింటినీ పునరుద్ధరించి కోట్లాది రూపాయలు వెచ్చించి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతులకు సాగునీరు అందించారని కొనియాడారు.

మంచిర్యాల జిల్లాలో గొల్లవాగు ప్రాజెక్టుకు తెలంగాణ ఏర్పడక ముందు రెండు వేల ఎకరాలకు మాత్రమే నీరివ్వగా..తెలంగాణ ఏర్పాటు అనంతరం అదనంగా 4 వేల ఎకరాలకు నీరు అందించారని చెప్పారు. ర్యాలీవాగు ప్రాజెక్టు కింద గతంలో వెయ్యి ఎకరాలకు మాత్రమే నీరు అందగా... ప్రస్తుతం ప్రాజెక్టు పూర్తి చేసి అదనంగా 1428 ఎకరాలకు నీరు అందించిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదని అన్నారు. నీల్వాయి ప్రాజెక్టు, వడ్డివాగుకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత అదనంగా ఖర్చు చేసి నీరు అందించారని చెప్పారు.

కుమ్రంభీం ప్రాజెక్టు కింద అదనంగా 9,500 ఎకరాలు, మత్తడివాగు కింద 6,900 ఎకరాలకు నీరందించినట్లు వివరించారు. కింద 9,500 ఎకరాలు, పాల్వాయి ప్రాజెక్టు కింద 5450 ఎకరాలు, గడ్డెన్నవాగు కింద 3వేల ఎకరాలు, సాత్నాల ప్రాజెక్టు కింద 6వేల ఎకరాలు, స్వర్ణ ప్రాజెక్టు కింద 2,500 ఎకరాల అదనపు ఆయకట్టు సేద్యంలోకి రావడానికి ప్రభుత్వం చేసిన కృషి ప్రత్యక్షంగా నిపిస్తోందన్నారు. అలాగే పెనుగంగా, సదర్‌మాట్, స్వర్ణ నదులపై చెక్‌డ్యాములు నిర్మాణంలో ఉన్నట్లు చెప్పారు. జిల్లాలో డిసెంబర్ నాటికి ఇంటింటికీ తాగునీరు అందించి ప్రజారోగ్యాన్ని కాపాడుతామన్నారు. వారిని దృష్టిలో ఉంచుకుని సీఎం కేసీఆర్ మిషన్ భగీరథ పథకాన్ని ప్రవేశ పెట్టారన్నారు.

## కేస్లాపూర్‌లో సందడే సందడి

### నాగోబా జాతర కోసం అంతా సిద్దం
### అభివృద్ది పనులను పర్యవేక్షించిన అధికారులు
### భద్రతపై పోలీస్ అధికారుల సమీక్ష

ఆదిలాబాద్,జనవరి20(ఆర్ఎన్ఎ): నాగోబా జాతర ప్రాంతంలో సందడి నెలకొంది. అధికారులు, ప్రజాప్రతినిధుల రాకపోకలు, పనులతో ఇక్కడంతా పండగ వాతావరణం నెలకొంది. కేస్లాపూర్‌లో మెస్రం వంశీయులు నిర్వహించే మహా పూజలతో జాతర ప్రారంభం కానుంది. నాగోబా జాతరకు వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు హాజరవుతారు. ప్రధానంగా గోండులు అత్యంత పవిత్రంగా భవించే జాతర కావడంతో ప్రభుత్వం అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేసింది. నాగోబా దర్శనం కోసం వచ్చే ప్రముఖులకు భక్తుల నుంచి ఇబ్బందులు ఎదురు కాకుండా చూస్తున్నారు. గిరిజనుల సంప్రదాయ సంస్కృతికి సంబంధించిన ఆటలపోటీల నిర్వహణపై శ్రద్ధ తీసుకున్నారు.నాగోబా ఆలయంతో పాటు అవసరం ఉన్న చోట్లల్లో ప్రత్యేక బ్యారి కేడ్లను ఏర్పాటు చేసి సమస్యలు లేకుండా అధికారులు అప్రమత్తం అయ్యారు. ముఖ్యంగా వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయడంతో జాతర సందడిగా ఆరింది. ఆదివాసీ గిరిజనుల సంస్కృతీ సంప్రదాయా లను కాపాడుకోవాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపైనా ఉందని కలెక్టర్ దివ్య దేవరాజన్ అన్నారు. ఆదివాసీ గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందన్నారు. నాగోబా జాతర ఉత్సవాలు నిర్వహణతో పాటు చేపట్టే అభివృద్ధికి నిధులు మంజూరు చేసిందన్నారు. సంస్కృతి సంప్రదాయాలు భావితరాలకు తెలిసేలా పండుగలను జరుపు కోవాలన్నారు. మెస్రం వంశీయులు నిర్వహించే ప్రత్యేక పూజలతోపాటు వారి సంప్రదాయాలు చాలా బాగున్నాయన్నారు. ఆదివాసీ గిరిజనులు తమ సంస్కృతిని ఇలాగే ముందుకు తీసుకుపోవాలన్నారు. నాగోబా జాతరలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. కెస్లాపూర్ నాగోబా జాతరలో భారీ బందోబస్తు ఏర్పాటు చేసి ప్రత్యేక పర్యవేక్షణ నిఘాతో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ నిర్వహించాలని ఏఎస్పీ శబరీష్ అన్నారు. నాగోబా ఆలయంతోపాటు దర్బార్, మర్రిచెట్ల ప్రాంతం, తైబజార్ ఏర్పాటు స్థలాలను పరిశీలించారు. కెస్లాపూర్ నుంచి మల్లాపూర్ గ్రామానికి ప్రజలు వెళ్లేందుకు తాత్కాలికంగా మట్టిరోడ్డు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. హెలిప్యాడ్ గ్రౌండ్‌తోపాటు కెస్లాపూర్ నుంచి నాగోబా ఆలయం ముఖద్వారం వరకు ప్రత్యేక బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడారు. జాతరలో అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. ఆలయ పరిసరాల్లో 50 సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. జాతరలోప్రముఖులతోపాటు భక్తులకు సైతం ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. బస్టాండ్ ప్రాంతంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి ప్రయాణికులకు రక్షణ కల్పిస్తానమి ఏఎస్పీ తెలిపారు. నాగోబా జారతను పురస్కరించుకొని ఏర్పాట్లను అధికారులు చేస్తున్నారు. కెస్లాపూర్ నాగోబా దర్బార్‌హాల్‌లో ఐటీడీఏ అధికారులు సీసీ నిర్మాణ పనులను ప్రారంభించారు. నిర్మాణాల పనులను ఐటీడీఏ డీఈ తానాజీ దగ్గరుండి సీసీ నిర్మాణ పనులు చేయిస్తున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో మరుగుదొడ్లతోపాటు స్నానపుగదుల ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. నాగోబా ఆలయ ఆవరణలో తాగునీటి పైపులైన్ మరమ్మత్తులతో పాటు నల్లాలను ఏర్పాటు చేస్తున్నారు. ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాటు చేసే భూమిలో పత్తి కర్రలను తొలగిస్తున్నారు. రంగుల రాట్నలు ఏర్పాటు చేసే భూమిలో సైతం పత్తి కర్రలను తొలగించి భూమిను చదును చేస్తున్నారు. ఆయా శాఖలకు చెందిన అధికారులు, మెస్రం వంశీయులు అందుబాటులో ఉంటూ పనులను పర్యవేక్షిస్తున్నారు.

## గొర్రెల పంపిణీ పథకంపై ఆరా

### –దుర్వినియోగం కాకుండా చర్యలు

జనగామ,జనవరి20(ఆర్ఎన్ఎ): బ్సిడీ కింద వచ్చిన గొర్రెల అమ్మకం.. కొనుగోలు నేరమని అధికారులు పేర్కొంటున్నారు. మొత్తంగా ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు అధికారులు చర్యలు ముమ్మరం చేస్తున్నారు. గొర్ల కాపర్లలో అవగాహన పెంచుతోంది. గొర్రెలకు సంపూర్ణ రక్షణకు గొర్రెల యూనిట్ల లబ్ధిదారులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా అధికారులు చర్యలు తీసుకుంటు న్నారు. యూనిట్ సొమ్ములో ఇన్సూరెన్స్ కూడా తోడై ఉంది. దీంతో ఏ ఒక్క గొర్రె చనిపోయినా దాని స్థానంలో మరో గొర్రెను అందించనున్నారు. అయితే ఈ వివరాలను ఎప్పటికప్పుడు అధికారులకు నివేదించాల్సి ఉంటుంది.

గొర్రెల పంపిణీ పథకం దుర్వినియోగం కాకుండా ఉండేందుకు గొర్రెల సంరక్షణపై నిఘాను కట్టుదిట్టం చేస్తున్నారు. ప్రతీ 15 రోజులకు ఒకసారి తనిఖీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎక్కడైనా దుర్వినియోగం జరిగితే రెవెన్యూ రికవరీ యాక్టు కింద వడ్డీతో కలిపి సబ్సిడీ సొమ్మును వసూలు చేస్తామని హెచ్చరికలు సైతం జారీ చేశారు. అంతేకుండా సదరు సంఘాలను బ్లాక్ లిస్ట్‌లో పెడతామని.. అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో అందజేసిన గొర్రెల యూనిట్ల పరిస్థితిని తెలుసుకోవడం ద్వారా నిరంతర నిఘా పెట్టనున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే గొర్రెల సహకార సంఘాల అధ్యక్షులకు అవగాహన కల్పించారు. గొర్ల కాపర్ల జీవన ప్రమాణాలను పెంచేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన గొర్రెల యూనిట్ల పథకాన్ని మరింత పటిష్టంగా అమలు చేసేందుకు అధికార యంత్రాంగం కసరత్తులు చేస్తోంది.. పలు చోట్ల గొర్రెల యూనిట్లను అమ్ముకుంటున్నారనే సమాచారంతో యంత్రాంగం అప్రమత్తమైంది. గొర్రెల యూనిట్లు దుర్వినియోగం కాకుండా ఉండేందుకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా ఆయా మండలాల్లోని ఎంపీడీఓలు, తహసీల్దార్‌లకు బాధ్యతలు అప్పగించారు. సఅంతేకాకుండా గొర్రెల కాపరులకు కూడా ప్రభుత్వం రక్షణ కల్పిస్తోంది. ఎవరైనా గొర్ల కాపరులు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ లక్ష ఇన్సూరెన్స్ సొమ్ము రానుంది. ఇదిలా ఉంటే గొర్రెల సంరక్షణ కోసం పశువైద్యాధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. లబ్ధిదారుల వద్దకు చేరుకోగానే వాతావరణ పరిస్థితులను తట్టుకునేలా టీకాలు వేస్తున్నారు. అనారోగ్యానికి గురైన వారికి చికిత్సలు చేసి లబ్ధిదారులకు అండగా నిలుస్తున్నారు. ఇప్పటికే సంఘాల అధ్యక్షులకు ఈ విషయంపై వివరిస్తూ ప్రోత్సహిస్తున్నారు.ఆసక్తిగల గొర్రెల కాపరులు తమ గ్రామాల్లో ఉన్న పండ్ల తోటల యజమానులతో మాట్లాడుకుంటే సదరు తోటల్లో ఉచితంగా గడ్డి జాతుల విత్తనాలను చల్లుకోవచ్చునని పేర్కొంటున్నారు. తద్వారా గొర్రెలకు మేత లభించడంతోపాటుగా.. గొర్రెల ఎరువుతో చేనుకు బలం చేకూరుతుందని యంత్రాంగం పేర్కొంటోంది. అంతేకాకుండా లబ్ధిదారులకు రూ.మూడు వేలు ఆర్థిక సాయం కూడా అందించనున్నట్లు పేర్కొంటున్నారు.

## గ్రామాల్లో మంచినీటి సమస్యకు పరిష్కారం

### సమస్యలపై ప్రత్యేక దృష్టి
### ఖానాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి చర్యలు: ఎమ్మెల్యే

ఆదిలాబాద్,జనవరి20(ఆర్ఎన్ఎ): కొత్త మున్సిపాలిటీ ఖానాపూర్ అభివృద్ధి కోసం ప్రత్యేక దృష్టి సారిస్తామని ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ అన్నారు. నూతనంగా ఏర్పాటైన ఖానాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ఇది వరకే రూ. 20 కోట్లు మంజూరుచేశారన్నారు. ఎన్నికల కోడ్ ముగియగానే సెంట్రల్ లైటింగ్, డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కొత్త వార్డుల అభివృద్ధి కోసం ఒక్కో వార్డుకు రూ. కోటి మంజూరీ చేయిస్తామన్నారు. కేసీఆర్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని హామీలను నెరవేర్చే ప్రభుత్వమన్నారు. ఇచ్చిన హామీలన్నింటినీ దశలవారీగా అమలు చేసి తీరుతామని మంత్రి స్పష్టం చేశారు. ఖానాపూర్, కడెం మండలాల రైతులకు నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు పొన్‌కల్ వద్ద పెద్ద బ్యారేజీ నిర్మిస్తున్నామని, అది పూర్తి అయితే ఇక సాగు, తాగు నీటికి ఢోకా ఉండబోదన్నారు.

కుల మతాలకు అతీతంగా రాష్ట్రంలోని వృద్ధులకు, బీడీకార్మికులకు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు ప్రతి నెలా వెలాది రూపాయల ఆసరా పింఛన్‌లు ఇస్తున్న ఘనత దేశంలో ఒక్క టీఆర్ఎస్ ప్రభుత్వానిదే నన్నారు. ప్రజల మేలు కోరే టీఆర్ఎస్ పార్టీ బలపరుస్తున్న అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత ఖానాపూర్ ప్రాంతానికి చేసిన అభివృద్ధిని ఎమ్మెల్యే రేఖానాయక్ తన ప్రచారంలో ప్రజలకు వివరించారు. గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే రేఖానాయక్ పేర్కొన్నారు. గ్రామాల్లోని సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషిచేస్తానని హామీనిచ్చారు. అర్హులైన వారు డబుల్‌బెడ్‌రూం ఇండ్ల మంజూరుకు పేర్లు ఇవ్వాలని సూచించారు. మిషన్ భగీరథ పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ కింద తాగునీటి సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. గ్రామాలకు తాగునీటి సరఫరా చేయాలని అధికారులకు సూచించారు. వేసవిలోగా సమస్యాత్మక గ్రామాలకు తాగునీటి సరఫరా చేయాలని ఆదేశించారు. వేసవి కంటే ముందే ఇంటింటికి నీరందించడంతోపాటు వాటి నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలన్నారు. సాంకేతిక సమస్యలతో పాటు ఇతరత్రా సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటా మన్నారు. యుద్ధప్రాపదికన కుమ్రం భీం జలాశయం నుంచి శుద్ధజలం సరఫరా చేసే పనులు పూర్తి చేయాలని అన్నారు. గ్రామాల్లో మెగా సంస్థ చేపడుతున్న రక్షిత మంచినీటి ట్యాంకులు, పైపులైనింగ్ పనులను పరిశీలించారు. ఇప్పటివరకు పైపులైనింగ్ చేసిన గ్రామాల్లో సత్వరమే నీటి సరఫరా చేయాలని ఆదేశించారు. అలాగే గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిషన్ భగీరథతో సాధ్యమైనంత త్వరగా గ్రామం వరకు కాకుండా ఇంటింటికీ నల్లా ఏర్పాటు చేసి నీరందస్తామన్నారు.

## సమీప జిల్లాల నుంచి భారీగా మిర్చి రాక

### –ధరలు తగ్గడంతో రైతుల ఆందోళన

ఖమ్మం,జనవరి20(ఆర్ఎన్ఎ): ఈ సంవత్సరం గణనీయంగా మిర్చి సాగు తగ్గినప్పటికీ ఇతర జిల్లాల నుంచి భారీగా మిర్చి తరలివస్తోంది. పంటను తీసుకవచ్చే రైతులను దృష్టిలో ఉంచుకొని అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. పంటను నిల్వచేసుకునేందుకుగాను ఒక్క యార్డు సరిపోక పోయిన పక్షంలో రెండు యార్డులను సైతం ఏర్పాటు చేసే దిశగా అలోచన చేస్తున్నారు.

ఎట్టి పరిస్థితులలో యార్డుల లోపలి భాగం లోనే మిర్చి భస్తాలను ఉంచేవిధంగా చూస్తామని అధికారులు పేర్కొంటున్నారు. ఊహించిన దానికంటే ఎక్కువ మొత్తంలో రైతులు పంటను తీసుకవచ్చారు. వరుసగా మార్కెట్‌కు సెలవులు రావడం సీజన్ ప్రారంభం కావడంతో పెద్ద మొత్తంలో పంట యార్డుకు చేరుకుంది. దీంతో మిర్చి యార్డు బస్తాలతో కిక్కిరిసి పోతోంది. ఖమ్మం జిల్లాతో పాటు భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాలనుంచి రైతులు పంటను తీసుకుని వస్తున్నారని మార్కెట్ అధికారులు తెలిపారు. మార్కెట్ యార్డుకు భారీగా పంట రావడంతో మార్కెట్ కమిటీ అధికారులు అవసరమైన అన్ని రకాల చర్యలు చేప ట్టారు. యార్డులకు పంటను తీసుకవచ్చే రైతులకు మంచినీటి వసతితో పాటు ఇతర మౌలిక వసతులపై దృష్టి సారించారు.

## స్వచ్ఛ ఆదిలాబాద్‌కు సహకరించాలి

### మరుగుదొడ్ల కార్యక్రమం పూర్తి కావాలి

ఆదిలాబాద్,జనవరి20(ఆర్ఎన్ఎ): స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా మరుగుదొడ్లను జిల్లా వ్యాప్తంగా నిర్మిస్తున్న ట్లు డీఆర్‌డీవో పీడీ చెప్పారు. వీటి పురోగతిని ఎప్పటికప్పుడు కిందిస్థాయిలో అధికారులు తెలుసుకోవాలన్నారు. కొన్ని గ్రామాల్లో మరుగుదొడ్లను నిర్మించుకున్నప్పటికీ వాటిని వినియోగించడం లేదని తెలిపారు. మరుగుదొడ్ల నిర్మాణం నిరంతర ప్రక్రియ అని అన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకుని స్వచ్ఛ ఆదిలాబాద్‌కు చేయూతను ఇవ్వాలన్నారు. మరుగుదొడ్లు లేని వారు తక్షణమే దరఖాస్తు చేసుకుంటే అప్పటికప్పుడే నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. గ్రామీణ ప్రజలు మరుగుదొడ్లను నిర్మించుకొని వాటిని వినియోగించు కోవాలని సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాల మహిళలతో మరుగుదొడ్లను నిర్మించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అధికారులు గ్రామాలను సందర్శించి ఆరు బయట మూత్ర, మల విసర్జన చేస్తే వచ్చే అనర్థాలపై అవగాహన కల్పించి మరుగుదొడ్లను వినియోగించుకునేలా చేయాలన్నారు. బహిరంగ మూత్ర, మల విసర్జన ప్రాంతాలుగా ప్రకటించాలన్నారు. బేస్‌మెంట్ లెవల్‌లో ఒక బిల్లు వస్తుందని ఆతర్వాత మరుగుదొడ్డి పూర్తి అయితే అధికారులు పరిశీలించి ఫొటోలను చిత్రికరించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి మొత్తం బిల్లును చెల్లిస్తారన్నారు.

## మరోమారు మిర్చి రైతుల ఆందోళన

### ధరలు తగ్గించడంతో ఎనుమాముల మార్కెట్లో నిరసనలు

### రైతులకు అందని అధికారుల అండ

వరంగల్,జనవరి20(ఆర్ఎన్ఎ): ప్రభుత్వం ఎన్ని రాకాలుగా ఆదేశాలు ఇచ్చినా, హెచ్చరికలు చేసినా మిర్చి,కందిరైతులకు కస్టాలు తప్పడం లేదు. మొన్నటి వరకు ధరలు అమాంతంగ ఆపెరిగిన మిర్చికి ఇప్పుడు గడ్డుకాలం దాపురించింది. వ్యాపారులు ధరలు తగ్గించడంతో రైతులు ఆందోళనకు దిగారు. ఏకంగా క్వింటా మిర్చిపై నాలుగువేలు ధర తగ్గించారని మండిపడ్డారు. వ్యాపారులు కుమ్మక్కయి ఇలా చేశారని ఆందోళనకు దిగారు. వ్యాపారులపై తక్షణం చర్యలు తీసుకుని రైతులను ఆదుకోవాలన్నారు. ఇకపోతే పత్తి, సోయాబీన్ విషయంలో ఇబ్బందులు పడ్డ రైతులు ఇప్పుడు మిర్చి,కంది పండించి ఇక్కట్లు పడుతున్నారు. పత్తికి ప్రత్యామ్నాయంగా కంది వేయాలనే ప్రభుత్వ సూచనతో సాగు చేసి నష్టపోయామని వాపోతున్నారు.మద్దతు ధర దొరకక అవస్థలు ఎదుర్కొంటున్నారు. ప్రైవేటు వర్తకులు మార్కెట్లో ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా కందులు, వేరుసెనగ కొనడానికి వెనుకంజ వేశారు. ప్రభుత్వ సంస్థకు మద్దతు ధరకే విక్రయించాలనుకునే రైతులు వేచి ఉ ండవచ్చునని, తమ ఇష్టం మేరకు ప్రైవేటు వ్యాపారస్తులకు విక్రయించుకోవచ్చునని అధికారులు ప్రకటించడంతో కొందరు విక్రయించారు. పరోక్షంగా ప్రైవేట్ వ్యాపారులను ప్రోత్సహించి గిట్టుబాటు ధరలు రాకుండా చేస్తున్నారని మండిపడుతున్నారు. వివిధ మార్కెట్లలో ఇదేతంతు సాగుతోంది. మార్కెట్లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ సంస్థకు సరకును విక్రయించేందుకు పడిగాపులు పడుతున్నారు. వెంటవెంటనే కొనుగోళ్లు జరగక, అధికారుల తీరుతో తీవ్రమైన వేదనకు గురవుతున్నారు. ప్రభుత్వం ప్రతి గింజ కొంటుందని ప్రకటించినా, అందుకు భిన్నంగా మార్కెట్లో పరిస్థితి ఉందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రయ,విక్రయాలు సజావుగా సాగాలంటే, రైతులు సంయమనం పాటించాలని అంటున్నారు. మద్దతు ధరతో కొనుగోళ్లు జరగాలని కోరుతున్నామని, జరుగుతాయో లేదో చెప్పలేమన్నారు. మార్కెట్లో నిలిచి ఉన్న కందుల కొనుగోలుకు చర్యలు తీసుకుంటా మన్నారు. కంది దిగుబడులు గణనీయంగా పెరిగినా తీరా అమ్మకానికి పంట తీసుకొచ్చిన రైతులను వ్యవసాయ మార్కెట్‌లో ఎఫ్‌సీఐ కొనుగోలు కేంద్రం అధికారులు తేమసాకు చూపి నాణ్యత ప్రమాణాల పేరిట తిరకాసు పెడుతు న్నారు. చిల్లరకాంటా వ్యాపారులు, ప్రైవేట్ ట్రేడర్లతో మొన్నటి వరకు మార్క్‌ఫెడ్, ఇప్పుడు ఎఫ్‌సీఐ అధికారులు కుమ్మక్కై అసలైన రైతుల పంట కొనుగోళ్లకు మడతపేచీ పెడుతున్నారు. కొందరు వ్యాపారులు అధికారులతో కుమ్మక్కై ప్రభుత్వ మద్దతు ధరకంటే తక్కువకు కొనుగోలు చేసి తిరిగి అవే కందులను రైతు పేరిట ఎఫ్‌సీఐకి అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వరంగ సంస్థ కొనుగోలుకు నిరాకరించడంతో వ్యాపారులు మరింత ధర తగ్గిస్తున్నారు. ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ వ్యవసాయ మార్కెట్‌లో ఆచరణలోఎక్కడా కనిపించడం లేదు.

## మత్తడివాగుతో తీరనున్న సమస్యలు

### పూర్తి కావస్తున్న పనులు

ఆదిలాబాద్,జనవరి20(ఆర్ఎన్ఎ): జిల్లాలోని తాంసి మండలం వడ్డాడి సమీపంలో నిర్మించిన మత్తడివాగు ప్రాజెక్టు కుడికాలువ నిర్మాణంతో 1200 ఎకరాలకు సాగునీరు అందనుంది. జిల్లాలోని తాంసి, ఆదిలాబాద్, జైనథ్ మండలాల రైతుల భూములకు సాగునీరు అందించేందుకు తాంసి మండలం వడ్డాడిలో 2004లో మత్తడివాగు ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. 2008 ఆగస్టులో ప్రాజెక్టు పనులు పూర్తి అయ్యాయి. ఈ కాలువ ద్వారా వడ్డాడి, కప్పర్ల, బండలనాగాపూర్, జామిడి, చాందా-టి. సిర్సన్న, భోరజ్, సావర్‌గాం, తరోడ, మల్లాపూర్ భీంసరి, జందాపూర్ గ్రామాల్లోని 8500 ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంగా పనులు చేపట్టారు. ప్రాజెక్టు కుడికాలువ నిర్మాణంతో 1200 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుంది. రైతులు పంటలు సాగుచేసే ప్రతి ఎకరానికి సాగునీరు అందించే దిశగా తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. ఇప్పటికే మిషన్‌కాకతీయ పథకంలో భాగంగా చేపట్టిన చెరువుల మరమ్మతుల కారణంగా జిల్లాలోని రైతులు రెండు పంటలను సాగు చేసుకుంటున్నారు. ప్రాజెక్టుల ఆధునీకీకరణతో ఆయకట్టు భూములు సస్యశ్యామలంగా మారనున్నాయి. రైతులు రెండు పంటలు సాగుచేసుకునే అవకాశాలుండడంతో ప్రభుత్వం ఈ కాలువ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఈ కాలువ నిర్మాణంతో తాంసి మండలం హస్నాపూర్, పొన్నారి, తలమడుగు మండలం ఖోడద్ గ్రామాలకు చెందిన రైతులకు ప్రయోజనం చేకూరనుంది. కాలువ నిర్మాణం పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టడంతో ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న తమ కల నేరవేరిందని వారు అంటున్నారు. ఇదిలావుంటే కడెం జలాశయం, గూడెం ఎత్తిపోతల కింద యాసంగిలో సాగు చేస్తున్న రైతులు ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోవాలని కడెం జలాశయం ఈఈ సూచించారు. ప్రస్తుతం జలాశయాల్లో ఉన్న నీరు ఆరుతడి పంటలకు మాత్రమే సరిపోతుందన్నారు. కాల్వ కింద ఉన్న రైతులు వరి సాగుచేస్తే కింది రైతులకు నీరందని పరిస్థితి నెలకొంటుందన్నారు. వారబందీ ప్రకారమే నీరు విడుదల చేయనున్నందున వరి సాగు చేసే రైతులు ఆ తర్వాత నీరందక ఇబ్బందులు ఎదుర్కొంటారని అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఆరుతడి పంటలు సాగు చేసి అధికారులకు సహకరించాలని కోరారు.

## మున్సిపల్ ఎన్నికల్లో బిజెపికే పట్టం కట్టాలి

### -కాంగ్రెస్ ,కమ్యూనిస్టులకు కాలం చెల్లింది

మహబూబ్‌నగర్,జనవరి20(ఆర్ఎన్ఎ): కాంగ్రెస్, కమ్యూనిస్టులు తమ మౌలిక సిద్ధాంతాలు వదిలేసి రాజకీయం చేస్తున్నారని బిజెపి రాష్ట్ర కార్యదర్శి ఆచారి ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఉనికి కోల్పోతోందని, టీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయ పార్టీగా బీజేపీ ఎదుగుతోందని చెప్పారు. డబుల్ బెడ్‌రూం, దళితులకు మూడెకరాల భూపంపిణీ, రైతుల రుణమాఫీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. హామీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు బీజేపీ ప్రత్యేక ఉద్యమం చేపడుతుందని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బిజెపికి పట్టం కట్టాలని ఆయన పిలుపునిచ్చారు. కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆర్థిక సాయం అందించి ఆదుకుంటోందని అన్నారు.తెలంగాణ ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం సాయం అందించటంతో పాటు గ్రామీణ వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చేందుకు పలు కార్యక్రమాలు చేపడుతోందన్నారు. రైతుల దుస్థితిని మార్చేందుకు 'ప్రధాన మంత్రి కృషి సంచాయ్ యోజన పథకం' అమలు చేస్తోందన్నారు.

## నిర్వీర్యం అవుతున్న ప్రభుత్వరంగం

ఏలూరు,జనవరి20(ఆర్ఎన్ఎ): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న నూతన ఆర్థిక, పారిశ్రామిక విధానాల వల్ల ప్రభుత్వరంగం నిర్వీర్యమవుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి డేగా ప్రభాకర్ తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి బిసి, మైనార్టీలకు ప్రయివేటురంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని, ఢిల్లీ తరహాలో కార్పొరేట్ కాలేజీల్లో, స్కూళ్లలో ఫీజుల నియంత్రణ ఉండాలని డిమాండ్ చేశారు. సహజ వాయువుల వెలికితీతతో సారవంతమైన భూములు నాశనం కావడమే కాకుండా పర్యా వరణానికి పెనుముప్పు వాటిల్లుతుందన్నారు. జిల్లాలోని అందలూరు, కృష్ణా జిల్లా మోదుగుమూడి, కొమరల్లపూడి తీరప్రాంతాల ప్రజలు భయాందోళన చెందుతున్నారన్నారు. దీనివల్ల ఉత్పన్నమయ్యే మిథేన్ భూతాపాన్ని పెంచుతుందని, అణుధార్మిక రాడన్ వాయువు వెలువడి వాయుకాలుష్యం ఏర్పడుతుందని శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తున్నారని తెలిపారు.

# అభివృద్ధికి కేరాఫ్ సూర్యాపేట



### మరింతగా ముందుకు సాగేలా ఆశీర్వదించాలి

### అధికార పార్టీకి పట్టం గడితనే అభివృద్ధి

### ప్రచారంలో మంత్రి జగదీశ్వర్ రెడ్డి

సూర్యాపేట,జనవరి20(ఆర్ఎన్ఎ): టీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని మరింత ముందుకు తీసుకువెళ్లేలా సూర్యాపేట పట్టణవాసులు మున్సిపల్ ఎన్నికల్లో తీర్పు ఇవ్వాలని మంత్రి జగదీష్ రెడ్డి ఓటర్లను కోరారు. సూర్యాపేటను మరింతగా అభిశృద ÷-ద ఇలో ముందు నిలిపేందుకు చేస్తున్నకృషికి తోడ్పడాలన్నారు. సూర్యాపేట మున్సిపాలిటీలో మంత్రి సోమవారం విస్తృతంగా పర్యటించి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఒకప్పుడు మూసి మురికి నీరు తాగి రోగాల బారినపడ్డ సూర్యాపేట పట్టణవాసులకు నేడు స్వచ్ఛమైన కృష్ణా జలాలు అందిస్తున్నట్లు తెలిపారు. వ్యాపారాలు స్వేచ్ఛగా చేసుకునేలా శాంతిభద్రతలు నెలకొల్పామన్నారు. 2014 ముందకు కరెంట్ ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి.. కానీ నేడు సీఎం కేసీఆర్ నాయకత్వంలో 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామన్నారు. అన్ని ఆలోచించి కారు గుర్తుకు ఓటేసి టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించా ల్సిందిగా మంత్రి కోరారు. అభివృద్ధి పాలనతో యావత్ దేశానికే ఆదర్శంగా నిలిచేలా రాష్ట్రంలో టీఆర్ఎస్ పార్టీ సరికొత్త రికార్డులు సృష్టిస్తోందన్నారు. . వినూత్న పథకాలతో కనీవినీ ఎరుగని అభివృద్ధి సాధించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మాత్రమే దక్కుతుంది. అలాంటి గులాబీ జెండా కలిగిన టీఆర్ఎస్ పార్టీ కారు గుర్తు అందరినీ శ్రీరామరక్షగా కాపాడుకుంటుందన్నారు. అందుకే గత ఆరేండ్లుగా ఎన్నిక ఏదైనా వరుస విజయాలతో గులాబీ జెండా చరిత్ర లిఖిస్తోందని జగదీశ్‌రెడ్డి అన్నారు. అభివృద్ధే ఎజెండాగా ముందుకు సాగుతున్నామని, ఎలాంటి ఎజెండా లేకుండా ప్రచారం చేస్తున్న విపక్షాల పరిస్థితిపై ప్రజలంతా నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. టీఆర్ఎస్ అభివృద్ధి పాలనపై పూర్తి విశ్వాసంతో ఈనెల 22న జరుగనున్న మున్సిపల్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి టీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించు కునేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సందర్భంగా పలు వార్డుల్లో కాంగ్రెస్, బీజేపీల నుంచి టీఆర్ఎస్‌లో చేరగా వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ క్రమ శిక్షణతో కూడిన పార్టీ టీఆర్ఎస్ అని.. పార్టీ విద్రోహక చర్యలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితిలోనూ క్షమించబోమని.. ఎంతటి వారైనా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే పార్టీ నుంచి తొలగిస్తామన్నారు. ప్రశాంత వాతావరణంతో కూడిన నిరంతరం అభివృద్ధి పాలనే ఎజెండాగా తాము ముందుకు సాగుతున్నామని..కానీ ఏ ఎజెండా లేకుండా విపక్షాలు ప్రచారం చేస్తుంటే ప్రజలంతా నవ్వుకుంటున్నారన్నారు. మున్సిపల్స్ ఎన్నికల ఫలితాల్లో చరిత్ర నిలిచి పోయాలే అభ్యర్థులు గెలపొందనున్నట్లు చెప్పారు. ఆయా వార్డుల్లో జరిగిన కార్యక్రమాల్లో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, జిల్లా గ్రంథా లయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, జడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణ, రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# పచ్చదనాన్ని పెంపొందించండి : కలెక్టర్



మన్సూరాబాద్, జనవరి 20: మన్సూరాబాద్ ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో ఉన్న ఖాళీ స్థలాల్లో మొక్కలను నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని వైద్య సిబ్బందికి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ హరీష్ సూచించారు. మన్సూరాబాద్ ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఆదివారం ఉదయం పల్స్ పోలియోను ప్రారంభించడానికి వచ్చిన ఆయన ఆస్పత్రితో పాటు పరిసరాలను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ప్రతి రోజు ప్రభుత్వ ఆస్పత్రికి ప్రజలు ఎంత మంది వస్తున్నారు. వచ్చే వారికి తగిన సదుపాయాలు కల్పించగలుగుతున్నారా... అని కలెక్టర్ వైద్య సిబ్బందిని ప్రశ్నించారు. ఆస్పత్రికి అవసరమైన సిబ్బంది ఉన్నారా అని అడిగి తెలుసుకున్నారు.

ఆస్పత్రికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగుకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి కలెక్టర్ సూచించారు. ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన క్షయ వ్యాధి నివారణ కేంద్రం వలన సాధారణ వైద్యం కోసం వచ్చే ప్రజలు, గర్భిణీలు దవాఖానకు వచ్చేందుకు జంకుతున్నారని ప్రజలు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. క్షయ వ్యాధి నివారణ కేంద్రాన్ని వేరే ప్రాంతానికి తరలించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఆస్పత్రి ప్రాంగణంలో ఉన్న క్షయ వ్యాధి నివారణ కేంద్రం విషయంపై త్వరలో అధికారులతో మాట్లాడతానని కలెక్టర్ ప్రజలకు తెలియజేశారు.

ఆస్పత్రి ప్రాంగణంలో ఉన్న పనిచేయని చేతి పంపుతో పాటు వాటర్ ఫ్యూరిఫైడ్‌కు మరమ్మతులు చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ స్వరాజ్యలక్ష్మీ, డిప్యూటీ డీఎంహెచ్ఓ బాలనరేంద్ర, డీఐఓ వినోద్, మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అర్చన, మన్సూరాబాద్ ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రం డాక్టర్లు టి. పులేందర్ నాయుడు, డాక్టర్ శాలిని, మన్సూరాబాద్ డివిజన్ టీఆర్ఎస్ అధ్యక్షుడు టంగుటూరి నాగరాజు, నాయకులు పోచబోయిన జగదీష్‌యాదవ్, గుంటకండ్ల రాజశేఖర్‌రెడ్డి, కె. వెంకటాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

# నిజామాబాద్ కార్పొరేషన్‌పై టీఆర్ఎస్ జెండా: మంత్రి వేముల



నిజామాబాద్ పట్టణంలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యే బిగాల గణేశ్.

నిజామాబాద్, జనవరి 20: నిజామా బాద్ కార్పొరేషన్‌పై టీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో మంత్రి నేడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత 40 ఏళ్ల నుంచి నిజామాబాద్‌కు డీఎస్ ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతోందన్నారు. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల వారి సంక్షేమాన్ని చూస్తున్నారన్నారు. ఎమ్మెల్యే గణేష్ రూ.800 కోట్లతో ఎంతో అభివృద్ధి చేశారన్నారు. బీజేపీ నాయకులకు అభివృద్ధి కనిపించడం లేదా అని ప్రశ్నించారు.

ఎంపీ అరవింద్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నాడన్నారు. సీఎం కేసీఆర్ పెన్షన్ కోసం రూ. 9 వేల కోట్లు ఇస్తుంటే కేంద్రం కేవలం రూ. 200 కోట్లు మాత్రమే ఇస్తుందన్నారు. కల్యాణలక్ష్మికి కేంద్ర నుంచి ఒక్క రూపాయి కూడా రావడం లేదన్నారు. నిజామాబాద్‌లో 800 డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం నుంచి 42 శాతం వాటా ఇవ్వాలి. అది రాష్ట్రాల హక్కు కచ్చితంగా ఇచ్చి తీరాల్సిందేనన్నారు. సర్వేలన్నీ టీఆర్ఎస్‌కు అనుకూలంగా ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరూ కారు గుర్తుకే ఓటు వేసి టీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాల్సిందిగా మంత్రి కోరారు.

## బంగారు తెలంగాణ అభివృద్ధి లక్ష్యం

### -అనేక పథకాలతో కార్యక్రమాలు: ఎమ్మెల్యే

జనగామ,జనవరి20(ఆర్ఎన్ఎ): తెలంగాణను బంగారు తెలంగాణగా తీర్చిదిద్దేందుకు కేసీఆర్ ప్రభుత్వం పనిచేస్తోందని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. అందుకే అన్ని వర్గాల ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందని చెప్పారు. మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకున్నదని అన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లాంటి పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కుతుందని ఆయన అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అధికారంలో ఉన్న సీమాంధ్ర పాలకులు 60 ఏళ్లలో చేయని అభివృద్ధి పనులను కేసీఆర్ ప్రభుత్వం ఐదేళ్లలో చేసిందని అన్నారు. సీమాంధ్ర పాలనలోనే తెలంగాణ ప్రాంతం వెనుకబాటుకు గురైందని దీంతో అభివృద్ధి జరుగలేదని అన్నారు. రాష్ట్రంలోని ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు సీసీ రోడ్లతో పాటు తారురోడ్లను నిర్మించేందుకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయిస్తున్నట్లు అయన తెలిపారు. చేపట్టే పనులను నాణ్యతతో కూడిన విధంగా చేయాలని నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే సహించేదిలేదని అభివృద్ధే ధ్యేయంగా టీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు.

## డబ్బుతో గెలవాలని చూస్తున్న టీఆర్ఎస్



హైదరాబాద్, జనవరి 20: మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించడం వల్లనే అభివృద్ధి సాధ్యమని కేంద్రమంత్రి జీ కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన హైదరాబాద్ పరిసరాల్లోని అనేక మున్సిపాలటీల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఆర్ఎస్ పార్టీ డబ్బులతో గెలవాలని చూస్తోందని, కేసీఆర్ ఎత్తులను చిత్తు చేయాలని ప్రజలను కోరారు. తెలంగాణను కేసీఆర్, ఒవైసీ కుటుంబాల నుంచి విముక్తి చేయించాలన్నారు. తెలంగాణ ప్రాంతం బీజేపీ పాలనలోనే అభివృద్ధి సాధిస్తుందన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో లక్ష మంది ఒవైసీలు అడ్డుకున్నా, బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఓట్లు అడగడానికి వచ్చే టీఆర్ఎస్ అభ్యర్థులను గత ఆరేళ్లలో మీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని నిలదీయాలన్నారు. రాష్ట్రం కుటుంబ పాలనతో నలిగిపోతోందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి మందగించిందన్నారు. నిరంతరం అభివృద్ధి కావాలంటే బీజేపీ ద్వారానే సాధ్యమవుతుందన్నారు. దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తామన్న హామీని నిలబెట్టుకోలేకపోయారన్నారు. పొదుపు సంఘాల రుణాలు ఏమయ్యాయన్నారు. యూపీఏ పదేళ్ల పాలనలో తెలంగాణకు కేంద్రం నుంచి నిధులు రాలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందన్నారు. అదే గత ఆరేళ్లలో కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం నుంచి ఇతోధికంగా నిధులు వచ్చాయన్నారు. ఈ విషయమై చర్చకు సిద్ధమని అనేకసార్లు తాను టీఆర్ఎస్ నేతలకు తెలియచేశానన్నారు. మున్సిపాలిటీలో అవినీతి రహిత పాలన, సమగ్రాభివృద్ధిని, ప్రజారోగ్యం, చక్కటి రోడ్లు, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించాలనే కృత నిశ్చయంతో బీజేపీ ఉందన్నారు.

## పిల్లలకు గవర్నర్ చుక్కల మందు



హైదరాబాద్, జనవరి 20: రాజభవన్ ఉద్యోగుల నివాస ప్రాంగణంలో పిల్లలకు రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆదివారం పోలియో చుక్కలు వేసి పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన పల్స్‌పోలియో విజయవంతంగా ముగిసింది. వైద్య ఆరోగ్య శాఖ పల్స్‌పోలియో అమలుకోసం విస్తృతమైన ఏర్పాట్లు చేసింది. అన్నిజిల్లాల్లోని పట్టణాలు, నగరాలు, గ్రామాల్లో 0-5 సంవత్సరాల మధ్య వయసు కలిగిన పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. దవాఖానాలతో పాటు, ప్రధాన కూడళ్లు, బస్‌స్టేషన్లు, రైల్వేస్టేషన్లు, ఎయిర్‌పోర్టుల్లో పిల్లలకు పోలియో చుక్కలు వేసేందుకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశారు. రాష్ట్రం మొత్తంలో 0-5 ఏళ్ల మధ్య వయసున్న పిల్లలందరికీ పోలియో చుక్కలు వేశారు. రాష్ట్రంలో దాదాపు 36 లక్షల మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్టు ప్రాథమిక సమాచారం వల్ల తెలిసింది. మారుమూల ప్రాంతాలకు కూడా వ్యాక్సిన్ డోస్‌లను సరఫరా చేశారు. మొత్తం 23,331 కేంద్రాలను ఏర్పాటు చేసి ఈ కార్యక్రమం అమలు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలతో సహా వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయి. కాగా, సోమ, మంగళవారాల్లో సిబ్బంది ఇంటింటికీ తిరిగి ఆదివారం పోలియో చుక్కలు వేయని పిల్లలకు పోలియో చుక్కలు వేస్తారు. 46 వేల బృందాలు రెండు రోజుల పాటు ఇంటింటికీ తిరిగి పరిశీలన చేస్తారు.

## సంక్షోభంలో వ్యవసాయ రంగం

### రైతులను నట్టేట ముంచుతున్న విధానాలు

ఏలూరు,జనవరి20(ఆర్ఎన్ఎ): దేశంలో వ్యవసాయ రంగం సంక్షోభంలో పడిందని కౌలు రైతు సంఘ నేతలు అన్నారు. బడా కంపెనీలకు లాభం చేకూర్చేందుకు వ్యవసాయ భూములు లాక్కుని రైతులను నట్టేట ముంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2011 కౌలు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. స్వామినాథన్ కమిటీ సిఫారసులు అమలు చేయాలని, అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనాలు, సామాజిక భద్రత పథకాలు అమలు చేయాలని కోరారు. పెద్దనోట్ల రద్దుతో రైతులు, వ్యవసాయకూలీలు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. చంద్రబాబు నిర్ణయాలతో వ్యవసాయ రంగం పరిస్థితి మరింత దిగజారిందన్నారు. వ్యవసాయరంగాన్ని రక్షించుకునేందుకు రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఉపాధి హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రపంచంలో భూతాపం పెరిగిపోయి వాతావరణ సమతుల్యం దెబ్బతిన్నదన్నారు. వ్యవసాయరంగంపై అధ్యయనం చేసేందుకు 52 కమిషన్లు వేశారని, ఒక్క కమిటీ సిఫారసు కూడా అమలు చేయలేదని తెలిపారు. ఆర్థిక సంస్కరణల కారణంగా దేశంలో వ్యవసాయ రంగం కుదేలైందన్నారు. 1995 తర్వాత దిగుమతి అవుతున్న వస్తువుల సంఖ్య నానాటికీ పెరుగుతోందన్నారు. తొలుత 1420 రకాల వస్తువులు దిగుమతి అయ్యేవని, ఇప్పుడు ఆ సంఖ్య 2800కి చేరిందని ఆందోళన వ్యక్తం చేశారు. స్వదేశంలో ఉత్పత్తి అవుతున్న వస్తువులను కూడా దిగుమతి చేసుకుంటున్నారని పేర్కొన్నారు. దీంతో దేశంలోనూ, రాష్ట్రంలోనూ కుటీర పరిశ్రమలు దెబ్బతిన్నాయని వివరించారు. చంద్రబాబు హయాంలో నీటి తీరువా వసూలు చేసే పద్ధతి ప్రవేశపెట్టారని అన్నారు. తెలిపారు. విద్యుత్ ఛార్జీలు వసూలు చేయడం, మార్కెట్ నియంత్రణ లేకపోవడం వంటివి ఆయన హయాంలోనే చోటు చేసుకున్నాయన్నారు.

# కామారెడ్డి జిల్లాలో జోరుగా ప్రచారం

## మూడు మున్సిపాలిటీల్లో నేతల హుషారు

కామారెడ్డి,జనవరి20(ఆర్ఎన్ఎ): చివరి రోజు కావడంతో వార్డుల వారీగా ఆయా పార్టీల్లో పోటాపోటీగా ప్రచారం హోరెత్తించారు. మున్సిపల్ ఎన్నికలను సవాల్‌గా తీసుకొని ప్రజల్లోకి వెళ్తున్నారు. బల్దియా ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ జిల్లాలోని మూడు మున్సిపాలిటీల్లో గులాబీ జెండా ఎగురవేసేందుకు సిద్ధం అవుతున్నది.

బల్దియా ఎన్నికల్లో పోటాపోటీ ప్రచారానికి నేటితో తెర పడనుండడంతో చివరి రోజు వీలైనంత మందిని కలుసుకొని ఓట్లను అభ్యర్థించే పనిలో పడ్డారు. ముఖ్యంగా గులాబీ సైన్యం ప్రజల మధ్యకు వెళ్లి ఓటర్లను కలుసుకున్నారు. వారం రోజుల నుంచి ఏకధాటిగా సాగుతోన్న ప్రచార హోరుకు సాయంత్రం 5గంటలకు ఫుల్‌స్టాప్ పడనుండడంతో సమయాన్నిజోరు పెంచారు. ఆయా వార్డుల్లో నేతలు ప్రచారం చేశారు. ఎవరికి వారు తామే అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. ఓటర్లను వ్యక్తిగతంగా కలుసుకోవడం, వారి మద్దతును కూడగట్టుకోవడంలో పోటీ ఏర్పడడంతో అభ్యర్థులకు కత్తిమీది సాములా మారింది. మారిన పరిస్థితులకు అనుగుణంగా అభ్యర్థులందరూ ఓటర్లను తమవైపునకు తిప్పుకునే ప్రయత్నాలనే చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా మూడు మున్సిపాలిటీల్లో 80 వార్డుల్లో ప్రచారం జోరుగా సాగించారు. సాయంత్రం 5గంటల తర్వాత ఎవ్వరు ప్రచారం చేసినా కోడ్ ఆఫ్ కండక్ట్ కింద కేసులు నమోదు చేసేందుకు ఎన్నికల యంత్రాంగం స ర్వం సిద్ధమైంది. ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రచార రంగంలో దూసుకపోతున్నారు. కామారెడ్డి జిల్లాలో మూడు మున్సిపాలిటీలో 80వార్డులుండగా కేవలం కామారెడ్డిలో 49 వార్డులున్నాయి. ఇక్కడ జరుగుతోన్న పోరు రసవత్తరంగా నెలకొంది. కాంగ్రెస్ పార్టీ నుంచి షబ్బీర్ అలీ ప్రధాన ప్రచారంగా మారారు. ఓట్లను రాబట్టి పరువును నిలబెట్టుకునేందుకు కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. బిజెపి కూడా జోరుగా ప్రచారం చేపట్టింది. 49 వార్డుల్లో పోటీ చేస్తోన్న టీ ఆర్ఎస్ పార్టీ అత్యధిక సీట్లను కైవసం చేసుకునేందుకై సిద్ధమైంది. తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తోన్న పథకాల్లో లబ్ధిదారులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, బీడీ కార్మికులు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను బాగా ప్రచారం చేస్తున్నారు. శాసనసభాపతి పోచారం శ్రీనివాస రెడ్డి కంచుకోట బాన్సువాడలో పోరు ఏకపక్షంగానే ఉండేలా టీఆర్ఎస్ నేతలంతా కృషి చేస్తున్నారు. బాన్సువాడలో రూ.100 కోట్లతో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ బాన్సువాడ మున్సిపాలిటీ ఎన్నికల ఇన్‌చార్జి, జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ షిండే, రాష్ట్ర నాయకుడు పోచారం భాన్కర్‌రెడ్డి తీవ్రంగా శ్రమిస్తున్నారు. నిరాటంకంగా ప్రచారాన్ని సాగి స్తూ ఓటర్లను తమవైపునకు తిప్పుకుంటున్నారు. ముస్లిం, మైనార్టీ వర్గాలతో పాటుగా డబుల్ లబ్దిదారులు, పెన్షన్‌దారుల ఆశీస్సులు పొందుతున్నారు. ఇక ఎల్లారెడ్డి నియోజకవర్గ కేంద్రంలో ఎమ్మెల్యే జాజాల సురేందర్ సైతం నూతన మున్సిపాలిటీపై గులాబీ జెండాను ఎగురవేయాలనే పట్టుదలతో పని చేస్తున్నారు. 12 వార్డుల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకొని టీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు బహుమానంగా ఇవ్వాలనే ఉద్దేశంతో ఉన్నారు. పోటీలో నిలిచిన వారిలో అత్యధికులు చదువుకున్న వారే కావడంతో ఓటర్లను కలుసుకునేందుకు సులువుగా ఫేస్‌బుక్, వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సౌకర్యాలను వాడుకుంటున్నారు. అంతేకాక, అభ్యర్థుల వీడియో సందేశాలు, ఫొటోలతోనూ సందేశాత్మకమైన వీడియోలను రూపొందించి ప్రతి ఒక్కరికీ వ్యక్తిగతంగా సెల్‌ఫోన్లకు పంపుతుండడం విశేషం. సామాజిక మాధ్యమాల్లోనూ ప్రచారం కొత్త తరహాలో సాగుతున్నది.

# అభివృద్ధి టీఆర్ఎస్ లక్ష్యం

## ఆర్మూర్ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

నిజామాబాద్,జనవరి20(ఆర్ఎన్ఎ): టీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తుందని, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రజల బాగోగుల కోసం పనిచేస్తున్న టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులనే గెలిపించుకోవాలని ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ మున్సిపల్‌లో టీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. పలు కూడళ్ల వద్ద మాట్లాడుతూ.. ఆర్మూర్‌కు ప్రాతినిధ్యం వహించిన హేమాహేమిలు చేయలేని ఎన్నో అభివృద్ధి పనులు చేయించడం జరిగిందన్నారు. ఆర్మూర్‌లోని ఆర్టీసీ రోడ్, ఆలూర్ బైపాస్‌రోడ్డు, సిద్ధుల గుట్టఫూట్ రోడ్ల నిర్మాణాలను చేపట్టామన్నారు. రైతాంగానికి రైతుబంధు, రైతుబీమా, 24 గంటల కరెంటును అందిస్తున్నట్లు చెప్పారు. ఎత్తిపోతల పథకాల ద్వారా చెరువులను నింపుతూ రైతుల పంటల నీరందిస్తున్నామన్నారు. పసుపు బోర్డు సాధనకు మాజీ ఎంపీ కల్వకుంట్ల కవితతో కలిసి ఢిల్లీతో పాటు, ఇతర రాష్ట్రాల్లో ఎందరినో కలిసిన విషయం తెలిసిందేనన్నారు. టీఆర్ఎస్ పార్టీ పసుపు బోర్డు కోసం ఎన్నో ప్రయత్నాలు చేశామన్నారు. గత ఎంపీ ఎన్నికల్లో ఎంపీగా గెలిచిన 5 గంటల్లోనే పసుపు బోర్డు తెస్తానని ప్రగల్భాలు పలికిన వారు ఏక్కడున్నారని ప్రశ్నించారు. మళ్లీ ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో బీజేపీ నాయకులు పసుపు బోర్డు వచ్చింది అనే కొత్త రకం నాటానికి తెరలే పారన్నారు. ఆర్మూర్ పట్టణాభివృద్ధికి రూ.700 కోట్ల నిధులను తీసుకొచ్చి టీఆర్ఎస్ పార్టీ తరఫున అభివృద్ధి చేశామన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ఆర్మూర్ పట్టణ అభివృద్ధి కళ్లారా చూసిన మీరు ఆలోచన చేసి ఓట్లు వేయాలన్నారు. పని చేసిన టీఆర్ఎస్ పార్టీని, తమ పార్టీ బలపర్చి బరిలో నిలిపిన కౌన్సిలర్ అభ్యర్థులను కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి కోరారు.

# మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు

## భారీగా బందోబస్తు ఏర్పాటు చేసిన అధికారులు

## వెబ్ కాస్టింగ్ ద్వారా ఇసికి అనుసంధానం

నిజామాబాద్,జనవరి20(ఆర్ఎన్ఎ): మున్సిపల్ ఎన్నికల తేదీ దగ్గర పడుతుండడంతో పోలింగ్ ఏర్పాట్లను అధికారులు వేగవంతం చేశారు. ఇప్పటికే పోలింగ్ కేంద్రాల గుర్తింపు పూర్తికాగా, పోల్ చీటీల పంపిణీ చేపడుతున్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని ఇదివరకే నియమించగా.. వారికి దశల వారీగా శిక్షణ సైతం పూర్తి చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్, ఎస్ఎస్ టీంలు, అసిస్టెంట్ ఎలక్షన్ అధికారులు, వ్యయ పరిశీలకులతోపాటు సమస్యాత్మక కేంద్రాల వద్ద మైక్రో అబ్జర్వర్లను నియమించారు. ఈ నెల 22న మున్సిపల్‌కు ఎన్నికను నిర్వహించనున్నారు. నిజామాబాద్ బల్దియా ఎన్నికల నిర్వహణకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆయా ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులకు ఎన్నికల బాధ్యతలను అప్పగించారు. ఈ బాధ్యతలు చేపట్టిన అధికారులు ఎన్నికల విధుల్లో పాల్గొనేందుకు వివిధ విభాగాల వారీగా బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో ఇద్దరు లేదా ముగ్గురు అధికారులు విధులు నిర్వహించనున్నారు. వ్యయ పరిశీలకులు, సమస్యాత్మక కేంద్రాల వద్ద మైక్రో అబ్జర్వర్లను నియమించారు. పట్టణ సరిహద్దు గుండా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి స్టాటిస్టికల్ సర్వైలెన్స్ టీం (ఎస్ఎస్‌టీ)లను సైతం ఏర్పాటు చేశారు. అసిస్టెంట్ ఎలక్షన్ అధికారితో పాటు వ్యయ పరిశీలకులను నియమించారు. పలు సమస్యాత్మక కేంద్రాలు ఉన్నట్లు అధికారులు, పోలీసులు సంయుక్తంగా సర్వేచేసి నిర్ధారించారు. ఈ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలను చేపట్టారు. వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించేందుకు మైక్రో అబ్జర్వర్‌లను నియమించారు. ఎన్నికల రోజు ప్రత్యేక బృందాలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఎప్పటికప్పుడు సరళిని తెలుసుకొని రాష్ట్ర ఎన్నికల సంఘానికి సమాచారం చేరవేస్తాయి. ఈ ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులకు శిక్షణ దశల వారీగా ఇచ్చి సిద్ధం చేశారు.

పోలింగ్ బూత్‌లో విధులు నిర్వహించే అధికారులతో పాటు పర్యవేక్షణ, ఇతర విధులను నిర్వహించేందుకు అధికారులను జిల్లా ఎన్నికల అధికారి కేటాయించారు. వెబ్‌క్యామ్‌లను ఏర్పాటు చేసి జీపీఎస్ సిస్టంతో కలెక్టర్ కార్యాలయం, ఎస్పీ కార్యాలయంతో పాటు రాష్ట్ర ఎన్నికల అధికారి కార్యాలయానికి అనుసంధానం చేస్తున్నారు. ఎప్పటికప్పుడు పోలింగ్ సరళిని పరిశీలిస్తూ ఏమైనా సంఘటనలు చోటు చేసుకుంటే అప్పటికప్పుడు అప్రమత్తం చేయనున్నారు. ఇలా అధికారులు బల్దియా ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించి పోలింగ్ సరళిని పెంచడానికి ముందస్తు చర్యలను చేపట్టారు.

# అభివృద్ధి చేసే టీఆర్ఎస్‌ను గెలిపించండి: మంత్రి మల్లారెడ్డి



మేడ్చల్,జనవరి20(ఆర్ఎన్ఎ): అభివృద్ధి చేసే టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని, అభివృద్ధికి సహకరించే టీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాల్సిందిగా మంత్రి మల్లారెడ్డి ఓటర్లను కోరారు. బోడుప్పల్ పరిధిలోని చెంగిచర్లలో మంత్రి సోమవారం ఉదయం మున్సిపల్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి పాల్గొని మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డ ఆరు సంవత్సరాల కాలంలో మున్సిపాలిటీలు వినూత్నంగా అభివృద్ధి సాధించాయన్నారు. ఇతర పార్టీల మాటలు నమ్మొద్దన్నారు. టీఆర్ఎస్ పార్టీ మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమన్నారు. టీఆర్ఎస్ పార్టీకి మద్దతుగా నిలిచి అన్ని వార్డుల్లో అభ్యర్థులను గెలిపించాల్సిందిగా కోరారు. పని చేసేవారికే ఓటు వేయాలని.. వచ్చే నాలుగేళ్లు టీఆర్ఎస్ ప్రభుత్వమే ఉంటుందన్నారు. అర్హులైన పేదలకు పట్టా సర్టిఫికెట్లు అందజేయడంతోపాటు డబుల్ బెడ్ ఇండ్లు నిర్మించి ఇస్తామని మంత్రి మల్లారెడ్డి అన్నారు. గత ఆరేండ్ల టీఆర్ఎస్ పాలనలో సీఎం కేసీఆర్ హయాంలో 24 గంటలపాటు విద్యుత్ సరఫరా, మంచినీటి సరఫరా, రైతులకు రైతుబంధు, వృద్ధులు, వికలాంగులకు పింఛన్లు, షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి వంటి పథకాలు అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రాబోయే రోజుల్లో మున్సిపాలిటీలను మరింత అభివృద్ధి చేయడానికి టీఆర్ అభ్యర్థులకు ఓటువేసి గెలిపించాలని కోరారు.

# చివరి రోజు ప్రచార ఊపు

## పట్టణంలో జోరుగా ప్రచారహోరు

## ఎమ్మెల్యే జోగురామన్న ఆధ్వర్యంలో నేతల ప్రచారం

ఆదిలాబాద్,జనవరి20(ఆర్ఎన్ఎ): ఆదిలాబాద్ పట్టణం ప్రచారంలో అధికార టీఆర్ఎస్ జోరు పెంచింది. చివరి రోజు కావడంతో మాజీమంత్రి జోగు రామన్న తదితరులు వాడవాడలా ప్రచారం చేపట్టారు. టీఆర్ఎస్ అభ్యర్థులనే గెలిపించాలని కోరారు. అభివృద్ధి కొనసాగాలంటే టీఆర్ఎస్‌ను ఆదరించాలన్నారు.

జడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జి లోక భూమారెడ్డి అభ్యర్థులతో కలిసి ఆయన వార్డుల్లో ప్రచారం చేశారు. ప్రభుత్వం పథకాలను వివరించడంతో పాటు, పట్టణాభివృద్ధిలో భాగంగా చేపట్టిన పనులను వివరించి ఓటును అభ్యర్థించారు. ఈ నెల 22న జరిగే మున్సిపల్ ఎన్నికలకు సోమవారంతో ప్రచారం ముగియనున్న నేపథ్యంలో ప్రచారంలో నేతలు జోరు పెంచారు. గత వారం రోజులపాటు నాయకులు, అభ్యర్థులు మున్సిపల్ పరిధిలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. టీఆర్ఎస్ నాయకులు పక్కా ప్రణాళికలతో ప్రచారం చేపట్టారు. టీఆర్ఎస్ నాయకులు, అభ్యర్థుల ప్రచారానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో 49 వార్డుల ఉండగా ఈ నెల 14న నామినేషన్ల ఉపసంహరణ ముగిసింది. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు ఇండిపెండెంట్‌లు కలిపి 286 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. మైకులు, వాల్ పోస్టర్‌లు, స్టిక్కర్లతో వార్డుల్లో ఇంటింటా తిరుగుతూ ప్రచారాన్ని చేపట్టారు. ఆరు రోజుల పాటు వార్డుల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు తమ అనుచరులు, నాయకులతో కలిసి వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. మరోవైపు ప్రధాన పార్టీలైన టీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్, ఎంఐఎంతో పాటు ఇండిపెండెంట్‌లు తమను గెలిపించాలంటూ ఓటర్లను కోరారు. గతంలో మున్సిపల్ పరిధిలో 36 వార్డులు ఉండగా పునర్విభజనలో భాగంగా వార్డుల సంఖ్య 49కి పెరిగింది. ఆదిలాబాద్, మావల మండలాల్లో పలు గ్రామాలు మున్సిపల్ పరిధిలోకి వచ్చారు. దీంతో ఈ సారి గతంలో కంటే పోటీలో ఉన్న అభ్యర్థుల సంఖ్య సైతం పెరిగింది. మున్సిపల్‌లో వీలినమైన వార్డులతో పాటు పాత వార్డుల్లో నాయకులు, కార్యకర్తలు అభ్యర్థులతో కలిసి ప్రచారం నిర్వహించారు. గతంలో పంచాయతీలో పోటీ చేసిన నాయకులు ఈ సారి మున్సిపల్ ఎన్నికల బరిలో నిలిచి తమను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు.

# బిజెపితో పట్టణాలకు ఒరిగేదేమీ లేదు

## పట్టణాభివృద్ధి టీఆర్ఎస్‌కే సాధ్యం

## చివరి రోజు విస్తృతంగా ప్రచారం చేసిన మంత్రి

నిజామాబాద్,జనవరి20(ఆర్ఎన్ఎ): పొరపాటున ఎంపి ఎన్నికల్లో విజయం సాధించినంత మాత్రాన బిజెపికి మున్సిపల్ ఎన్నికల్లో అంత సీన్ లేదని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ఎన్నికల సమయంలో ఓట్లు దండుకునేందుకు బీజేపీ అభ్యర్థులు, ఆ పార్టీ నాయకులు చెప్పే కల్లబొల్లి మాటలను నమ్మి మోసపోవద్దని అన్నారు. బిజెపి గెలిచినంత మాత్రాన పట్టణ ప్రజలకు ఒరిగేదేమీ లేదన్నారు. అధికరా పార్టీ గెలిస్తేనే అభివృద్ధి సాగుతుందన్నారు. చివరి రోజు ఆయన ఎమ్మెల్యేలతో కలసి పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రాచరంలో పాల్గొనారు.

గ్రామీణ, పట్టణ ప్రాంతాలను అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడుతున్న టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. నిజామాబాద్ నగర పాలక సంస్థ పరిధిలో అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా నిర్వహించిన రోడ్డుషోలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆరునెలల క్రితం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఇప్పుడున్న ఎంపీ అరవింద్ పసుపు బోర్డును ఐదు రోజులుగా తెస్తామని మాయమాటలు చెప్పి పనికి రాని బాండు పేపర్ రాసిచ్చి రైతులను మోసం చేశారని ధ్వజమెత్తారు. ఎంపీగా గెలిచి ఆరునెలలు గడుస్తున్నా.. ఇంత వరకు పసుపు బోర్డు హామీ నీటిమూట గానే మిగిలిపోయిన విషయాన్ని ప్రజలు గ్రహించాలన్నారు. జిల్లాలో బీజేపీతో ఒరిగేదేమి లేదన్న విషయాన్ని అన్నివర్గాల ప్రజలు గుర్తించాలన్నారు. రాష్ట్రంలో టీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నందున, ఆ పార్టీ తరఫున పోటీలో నిలిచిన కార్పొరేటర్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రజల అభ్యున్నతి కోసం పాటుపడుతున్నది టీఆర్ఎస్ పార్టీ మాత్రమేనని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి టీఆర్ఎస్ అభ్యర్థుల విజయానికి ఎంతగానో దోహదపడుతాయని ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనమైన గ్రామాలకు కోట్లాది రూపాయల నిధులు సీఎం కేసీఆర్ మంజూరు చేశారని తెలిపారు.

# మున్సిపాలిటీల అభివృద్ధిలో కెటిఆర్ విఫలం

## 12శాతం రిజర్వేషన్లను విస్మరించిన కెసిఆర్

## జిల్లా కేంద్రంలో ప్రచారంలో పాల్గొన్న ఉత్తమ్

నల్లగొండ,జనవరి20(ఆర్ఎన్ఎ): పురపాలక శాఖ మంత్రి కెటిఆర్ మున్సిపాలిటీలను అభివృద్ధి చేయడంలో విఫలమయ్యారని తెలంగాణ పిసిసి అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి విమర్శిం చారు. జిల్లా కేంద్రంలో ఆయన పురపాలక ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. యూపిఏ ప్రభుత్వం హయాంలో ఉమ్మడి రాష్ట్రంలోని మున్సిపా లిటీల అభివృద్ధికి రూ.12వేల కోట్ల నిధులు మంజూరు చేశామని ఆయన అన్నారు. రాష్ట్ర ంలో అధికంగా ఉన్న మాదిగ సామాజిక వర్గానికి సిఎం కెసిఆర్ అన్యాయం చేశారని ఆరోపించారు. ఒక్కరికి కూడా మంత్రి మండలిలో అవకాశం ఇవ్వలేదని ఆయన విమర్శించారు. గిరిజనులు, మైనారిటీలకు 12 శాతం రిజర్వేషన్ల కల్పనపై రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధి కలిగి లేదని ఉత్తమ్ అన్నారు. రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో, ట్రిపుల్ తలాక్, జిఎస్‌టి విషయంలో బిజెపి ప్రభుత్వానికి కెసిఆర్ మద్దతిచ్చారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. టిఆర్ఎస్‌కు ఓటేస్తే అది బిజెపికి వేసినట్లే అని ఆయన అన్నారు. అందరికీ న్యాయం జరిగే పాలన కావలంటే కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఉత్తమ్ కుమార్‌రెడ్డి కోరారు. ఇదిలావుంటే భువనగిరి ఎంపి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వివిధ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. కేసీఆర్ పుట్టిన తర్వాతే మోసం పుట్టిందని, ఇలాంటి మోసపూరిత ముఖ్యమంత్రిని ఉరితీసినా తప్పు లేదని ధ్వజమెత్తారు. మోసపూరిత వాగ్దానాలతో కేసీఆర్ ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేస్తే డబ్బా ఇళ్లు అని విమర్శించిన కేసీఆర్.. డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఇస్తామని చెప్పి మాటతప్పారని విమర్శించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో తాను ఐటీ మంత్రిగా ఉన్నప్పుడు టీసీఎస్, ఏరోస్పేస్, ఫ్యాబ్‌సిటీ, ఔటర్‌రింగ్ రోడ్డు, జీఎంఆర్ అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మిస్తే.. ఇప్పటి ప్రభుత్వం ముచ్చర్లలో ఫార్మా సిటీ ఏర్పాటు చేసి ప్రజల నెత్తిన కాలుష్యం తెచ్చి పెట్టాలని చూస్తోందని మండిపడ్డారు. ఫార్మా భూములతో ఐటీ మంత్రి కేటీఆర్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని, వారి ఆగడాలకు త్వరలోనే అడ్డుకట్ట పడుతుందన్నారు.





# షాద్‌నగర్‌లో ఇంట్లో దూరిన చిరుత

## చాకచక్యంగా పట్టుకున్న అటవీ అధికారులు

రంగారెడ్డి,జనవరి20(ఆర్ఎన్ఎ): షాద్‌నగర్ పట్టణంలో చిరుతపులి హల్ చల్ చేసింది.పట్టణంలోని పటేల్ రోడ్డులో చిరుత హల్ చల్‌తో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమీపంలో ఉన్న కమ్మదనం అటవీక్షేత్రం నుంచి వచ్చిన చిరుతపులి మన్నె విజయ్‌కుమార్ అనే వ్యక్తి ఇంటిపై సేదతీరుతూ కనిపించింది. చిరుతను చూసేందుకు ప్రజలు పెద్దఎత్తున అక్కడికి చేరుకున్నారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు, అటవీశాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. అటవీశాఖ సిబ్బంది చిరుతకు మత్తు ఇచ్చి పట్టుకున్నారు. దీంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. అయితే ఆకలితో ఉన్న చిరుత ఈ ఇంట్లో దూరిందని భావిస్తున్నారు. తినడానికి ఏమీ దొరక్క అక్కడే నక్కింది. దీంతో అధికారులు సమాచారం అందుకుని దానిని పట్టుకున్నారు.

# అదృశ్యమైన బాలలు మృతి

## కుంటలో మునిగి చనిపోయారని గుర్తింపు

## కుంట నుంచి బాలల శవాల వెలికితీత

నిజామాబాద్,జనవరి20(ఆర్ఎన్ఎ): నిజామాబాద్ జిల్లాలో దారుణం జరిగింది. రెంజల్ మండలం పేపర్‌మిల్ గ్రామంలో అదృశ్యమైన ముగ్గురు విద్యార్థులు విఘతజీవులుగా కనిపించారు.

ప్రాథమిక పాఠశాలలో 3వ తరగతి చదివే వాగ్మరే దీపక్(9), 2వ తరగతి చదివే వాగ్మరే సిద్దార్థ్(8), 3వ తరగతి చదివే హుజెఫ్(8) ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో ఆడుకునేందుకు ఇంటి నుంచి బయల్దేరి కందకుర్తి వైపు వెళ్లారు. ఎంతకూ బాలురు ఇంటికి తిరిగి రాకపోవడంతో గాలింపు చర్యలు చేపట్టారు. కాగా కందకుర్తి శివారులో ఉన్న నీటి గుంతలో లభించిన బైక్ టైర్ ఆధారంగా రెంజల్ పోలీసులు సోమవారం గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. ఈతగాళ్లు నీటిగుంత నుంచి ముగ్గురు బాలుర మృతదేహాలను వెలికితీశారు. శవపరీక్ష నిమిత్తం మృతదేహాలను పోలీసులు బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాలుర మృతితో కుటుంబాల్లో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. ఈతకోసం వీరు కుటంలో దిగి మునిగిపోయి ఉంటారని భావిస్తున్నారు.

# నాగులబండలో ఎల్వీప్రసాద్ కంటి ఆస్పత్రి ప్రారంభం



సిద్దిపేట, జనవరి 20: సిద్దిపేట అర్బన్ మండలం నాగులబండ వద్ద ఎల్వీప్రసాద్ కంటి ఆస్పత్రి ప్రారంభమైంది. ఆస్పత్రిని మంత్రి హరీష్ రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి నేడు ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి చైర్మన్ జీఎన్‌రావు, హెటిరో డ్రగ్స్ చైర్మన్ పార్థసారథి, ఎమ్మెల్సీ రఘోత్తమ్‌రెడ్డి, జెడ్పీచైర్మన్ వేలేటి రోజారాధాకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్ మాట్లాడుతూ.. సిద్దిపేటలో ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇందుకు జీఎన్ రావు, పార్థసారథికి ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. ఇంత మంచి కంటి ఆస్పత్రిని అందరూ వినియోగించుకోవాలని కోరారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో కంటి సమస్యలు లేకుండా చేయడం కోసం రాష్ట్రవ్యాప్తంగా కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు.

సమాజానికి ఉపయోగపడాలనే సంకల్పంతో సేవాకార్యక్రమాలు చేస్తున్న హెటిరో డ్రగ్స్ సంస్థ చైర్మన్ పార్థసారథి రెడ్డి కృషి అభినందనీయమన్నారు. పేదలకు తక్కువ ధరకే మందులను అందిస్తున్న సంస్థ హెటిరో డ్రగ్స్ అన్నారు. సమాజానికి, పేదవారికి సేవ చేసినప్పుడే మనిషి జీవితం సార్థకమవుతుందన్నారు. ప్రతి 50 వేల మందికి ఒక సబ్‌సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నేటి తరానికి సెల్‌ఫోన్ ద్వారా ఎన్నో కంటి సమస్యలు ఉత్పన్నమౌతున్నాయన్నారు. కార్పొరేట్ స్థాయి కంటి వైద్యం ఇక్కడ లభిస్తుందన్నారు. అదేవిధంగా పేద ప్రజలకోసం రూ.400 కోట్లతో పార్థసారథి క్యాన్సర్ ఆస్పత్రిని నిర్మిస్తున్నరని.. సిద్దిపేటలో సైతం క్యాన్సర్ స్క్రీనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాల్సిందిగా మంత్రి కోరారు.

# ఢిల్లీలో మరో అగ్నిప్రమాదం

న్యూఢిల్లీ,జనవరి20(ఆర్ఎన్ఎ): దేశ రాజధాని ఢిల్లీలో మరో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. నగరంలోని సివిల్ లైన్స్ లోని ట్రాన్స్ పోర్ట్ డిపార్ట్‌మెంట కార్యాలయంలో సోమవారం ఉదయం ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన

సంఘటనాస్థలానికి చేరుకున్నారు. భారీగా ఎగిసి పడుతున్న అగ్ని జ్వాలలను ఎనిమిది ఫైర్ ఇంజన్లతో ఆర్పే ప్రయత్నం చేస్తున్నారు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్నారు. ఈ ప్రమాదానికి సంబంధించిన కారణాలు తెలియాల్సి ఉంది.

# ఆటోను ఢీకొన్న గుర్తు తెలియని వాహనం

## ప్రమాదంలో ఇద్దరు మహిళల మృతి

నిజామాబాద్,జనవరి20(ఆర్ఎన్ఎ): జిల్లాలోని జక్రాన్‌పల్లి మండలంలో గల అర్గుల్ వద్ద జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం సంభవించింది. ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లింది. ఈ దుర్ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న జక్రాన్‌పల్లి గ్రామానికి చెందిన పైడి సత్తెమ్మ, సుందరమ్మ అనే ఇద్దరు మహిళలు మృతిచెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

# పాతకారు అంటుకుని వృద్ధుడి సజీవదహనం

వికారాబాద్,జనవరి20(ఆర్ఎన్ఎ): కారులో వృద్ధుడు సజీవ దహనం అయిన సంఘటన సోమవారం ఉదయం వెలుగుచూసింది. వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలోని గొల్ల చెరువు ప్రాంతానికి చెందిన వీరన్న(70) పట్టణంలోని మర్రిచెట్టు కూడలి సమీపంలో ఉన్న దుకాణాల సముదాయాల్లో చిన్న చిన్న పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ప్రతిరోజు మర్రిచెట్టు సమీపంలోని కాలనీలో ఉన్న ఓ పాత కారులో నిద్రిస్తూ

ఉండేవాడు. ఆదివారం కట్టమైసమ్మ జాతర ఉత్సవాల సందర్భంగా భక్తులకు అన్నదానం చేసేందుకు అని రాత్రి కారు సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో వంటలు చేశారు. వంటలు పూర్తయిన తర్వాత మంటలు ఆర్పేయకుండా వదిలేయడంతో టెంటుకు మంటలు అంటుకున్నాయి. ఈ మంటలు ప్రమాదవశాత్తు వృద్ధుడు నిద్రిస్తున్న కారుకు వ్యాపించాయి. అప్పటికే మంటలు పూర్తిగా చెలరేగడంతో కారులో నిద్రిస్తున్న వృద్ధుడు సజీవదహనం అయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

# గుజరాత్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

## ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృతి

అహ్మదాబాద్,జనవరి20(ఆర్ఎన్ఎ): గుజరాత్ లోని సురేంద్రనగర్ జిల్లా, దేవ్‌పరా వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కారు అదుపు తప్పి, బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు అక్కడికక్కడే మరణించారు. మరో ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. గాయపడిని వారిని హుటాహుటిన స్థానిక హాస్పిటల్ కు తరలించారు. ప్రమాదానికి గల కారణాలను పోలీసులు వివరించారు. అతి వేగమే ప్రమాదానికి కారణమని వారు నిర్ధారించారు. వీరంతా ఆంధ్రప్రదేశ్, ప్రకాశం జిల్లా వాసులుగా పోలీసులు తెలిపారు. సోమనాథ్ ఆలయాన్ని దర్శించుకొని తిరిగి వస్తుండగా ఈ ఘోరం జరిగినట్లు వారు తెలిపారు. మరణించిన వారంతా ఒకే కుటుంబానికి చెందినవారిగా పోలీసులు తెలిపారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.